
సాక్షి నల్లగొండ

శుక్రవారం । 15 । సెప్టెంబర్ । 2023



తండా నుంచి జాతీయ స్థాయికి..
రంగుండ్లతండాకు చెందిన యువకుడు వీల్‌చైర్ క్రికెట్‌లో దేశం తరఫున ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదిగాడు. - IIలో



ఆ విగ్రహం జాడేదీ..?
గట్టుప్పల్ మండలం అంతంపేట గ్రామంలో లభించిన ముత్యాలమ్మ విగ్రహం జాడ కనిపించడం లేదు. - IIలో



కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలి
ఇచ్చిన హామీలను విస్మరించిన కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ అన్నారు. - IVలో

న్యూస్‌రీల్

సమ్మె నోటీసు అందజేత

నల్లగొండ టూటౌన్: ఈనెల 25 నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు తెలంగాణ ఆశ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కొండల్‌రావుకు గురువారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు లక్ష్మీనారాయణ, జిల్లా అధ్యక్షురాలు మహేశ్వరి మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. కనీస వేతనం రూ.18వేలు నిర్ణయించి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కార్యదర్శి వెంకటమ్మ, పార్వతమ్మ, సైదమ్మ, లలిత, శారద, జానకమ్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్, చిత్రంలో ఎస్పీ

నల్లగొండ క్రైం: రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కర్ణన్, ఎస్పీ అపూర్వరావు అన్నారు. గురువారం నల్లగొండ పట్టణంలోని జీఎం కన్వెన్షన్ హాల్లో జాతీయ, రాష్ట్ర, రోడ్డు భవనాల శాఖ, పోలీస్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ప్రమాద స్థలాలు, మూలమలుపుల వద్ద లైటింగ్, ప్రమాద హెచ్చరిక బోర్డులు, బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలన్నారు. రాంగ్ రూట్‌లో వెళ్లకుండా వాహనదారులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించాలని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు, డీఎస్పీలు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో ఆరోగ్య సేవలపై అధ్యయనం



విద్యార్థులను అడిగి వివరాలు సేకరిస్తున్న బృందం సభ్యులు

దేవరకొండ: కౌన్సిల్ ఫర్ సోషల్ డెవలప్‌మెంట్ అధ్యయన బృందం గురువారం దేవరకొండ, చందంపేట, ముదిగొండ, నేరేడుగొమ్ము మండలాల్లోని ఆశ్రమ పాఠశాలలను సందర్శించింది. ఈ సందర్భంగా అధ్యయన బృందం సభ్యులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుంకరి సత్యం ఆయా పాఠశాలల్లో రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలతో పాటు ఆరోగ్య వసతుల వివరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల పరిసరాలను పరిశీలించి పలు సూచనలు ఇచ్చారు. ఇందుకు సంబంధించి తుది నివేదికను ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపారు. వారి వెంట ఏసీఎంఓ డీవీ నాయక్, తిరుపతయ్య తదితరులున్నారు.

సర్పంచ్ పదవికి రాజీనామా



రామలచ్చయ్య

కనగల్: మండల పరిధిలోని బచ్చన్నగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సర్పంచ్ గుండెబోయిన రామలచ్చయ్య తన పదవికి రాజీనామా చేశారు. ఈమేరకు గురువారం కలెక్టర్, ఎమ్మెల్యేకు తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనప్పటికీ గ్రామాన్ని అభివృద్ధి చేయలేకపోవడంతోనే ఈ పదవికి రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. తనపై గ్రామస్తులు వ్యతిరేకంగా ఉన్నారని, ఎమ్మెల్యే కూడా సంతృప్తిగా లేకపోవడంతోనే రాజీనామా నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. తాను బీఆర్ఎస్ పార్టీని వీడేది లేదని తెలిపారు. కాగా.. రామలచ్చయ్య కుమారుడు వెంకటేశ్ ఉపసర్పంచ్‌గా ఉన్నారు.

యాదాద్రిలో విశేష పూజలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో గురువారం నిత్య కైంకర్యాలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున శ్రీస్వామి వారికి సుప్రభాత సేవ చేపట్టారు. ప్రధానాలయ ముఖ మండపంలో ఉత్సవమూర్తుల వద్ద అష్టోత్తర పూజలు, శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవ పూజలు గావించారు. సాయంత్రం జోడు సేవోత్సవం, సహస్రనామార్చన, రాత్రి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వార బంధనం చేశారు. వివిధ పూజల ద్వారా నిత్యాదాయం రూ.18,42,162 సమకూరినట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

- సిద్ధమవుతున్న గణనాథులు





గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు వినాయక విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. వీటికి తుది మెరుగులు దిద్దుతున్నారు. అదేవిధంగా విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు నిర్వాహకులు మండపాల వద్ద ఏర్పాట్లు చేస్తున్నారు. - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

ఓటు నమోదులో తిరకాసు

- సాకులు చెబుతూ దరఖాస్తులను తిరస్కరిస్తున్న అధికారులు
- అధికార పార్టీ నాయకులు ఇచ్చిన వాటినే నమోదు చేస్తున్నారని ప్రజల ఆరోపణ
- ఫామ్‌- 6, 8నూ పట్టించుకోవడం లేదని విమర్శలు



ఓటరు జాబితాపై రాజకీయ పార్టీ నాయకులతో సమావేశం నిర్వహిస్తున్న ఆర్డీఓ చెన్నయ్య (ఫైల్)

మిర్యాలగూడ: రానున్న ఎన్నికల నేపథ్యంలో 18 సంవత్సరాలు నిండిన యువతతోపాటు కొత్త ఓటరు నమోదు, ఓటు కార్డులో తప్పుల సవరణకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. ఈ క్రమంలో అధికార పార్టీ నాయకులు పట్టణ ప్రాంతాల్లో ఎక్కువగా దొంగ ఓట్లు నమోదు చేయిస్తున్నట్లు విమర్శలు వస్తున్నాయి. అధికారులు తమ దరఖాస్తులను నిరాకరిస్తున్నారని, ప్రతి దరఖాస్తులో ఏదో సాకు చెప్పి తీసుకోకుండా వెనక్కి పంపిస్తున్నారని సామాన్య ప్రజలు వాపోతున్నారు. కేవలం అధికార పార్టీ నాయకులు ఇచ్చిన దరఖాస్తులను తీసుకుని నమోదు చేస్తున్నారని, ఎలాంటి క్షేత్ర స్థాయి పరిశీలన లేకుండానే అప్రూవల్ చేస్తున్నట్లు ఆరోపిస్తున్నారు. దీంతో వలస వచ్చిన వారు, ఇటీవల వివాహం చేసుకుని ఆ ప్రాంతానికి వచ్చిన వారి ఓట్లు ఆయా నియోజకవర్గాల్లో నమోదు కావడం లేదు.

ఓటు కార్డులో సవరణలపై స్పందించని అధికారులు

ఓటు కార్డులోని పేరు, ఇంటి నంబర్, ఫొటో, ఇతర వివరాలను ఫామ్‌- 8 ద్వారా సవరించుకునేందుకు అవకాశం కల్పించారు. బీఎల్‌ఓలు దరఖాస్తులను పరిశీలించకుండా, సవరణ చేయకుండా నిర్లక్ష్యం చేస్తుండడంతో ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా చనిపోయిన వారి ఓట్లను ఓటరు జాబితా నుంచి తొలగించాల్సి ఉంటుంది. వాస్తవానికి ఆయా పోలింగ్ పరిధిలో విధులు నిర్వర్తించే బీఎల్‌ఓల వద్ద ఆ పోలింగ్ పరిధిలో చనిపోయిన వారి వివరాలు ఉంటాయి. బీఎల్‌ఓలు అంగన్‌వాడీ ఉద్యోగులు కావడంతో చనిపోయిన వారి పేరుమీద మరణ ధ్రువీకరణ పత్రం జారీ చేయడంలో అంగన్‌వాడీ టీచర్లు కీలకంగా వ్యవహరిస్తారు. కానీ కుటుంబ సభ్యులు అందుబాటులో లేకపోవడం, వారు సకాలంలో స్పందించకపోవడంతో చనిపోయిన వారి ఓట్లు జాబితాలో అలాగే ఉండిపోతున్నాయి.

పరిశీలించకుండానే తిరస్కరణ..

కొత్తగా ఓటు హక్కు పొందేందుకు ఫామ్‌- 6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దీనికి ఆధార్ కార్డుతోపాటు వయసు ధ్రువీకరణ పత్రం జత చేయాల్సి ఉంటుంది. 20సంవత్సరాలు పైబడి ఉన్న వారి దరఖాస్తులకు వయసు ధ్రువీకరణ పత్రం లేకపోయినా ఆధార్‌కార్డు ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. వీటిని ఎన్నికల అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. కానీ సంబంధిత అధికారులు పరిశీలించకుండానే తిరస్కరిస్తున్నారు. ఈనెల 19 వరకు ఓటుకు దరఖాస్తు చేసుకునేందుకు గడువు ఉన్నా.. ఎన్నికల అధికారులు కొత్త దరఖాస్తులను తీసుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

ఆధార్ లింక్ కాని ఓట్లు.. దొంగ ఓట్లుగా ఉన్నాయని

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 90శాతం ఓట్లకు ఆధార్ లింక్ చేసినట్లు సమాచారం. మిర్యాలగూడ నియోజకవర్గంలో 95శాతం ఓట్లకు ఆధార్ లింక్ చేశారు. మిగిలిన 5శాతం పూర్తి చేసి వందశాతం లక్ష్యాన్ని సాధించాలని ఎన్నికల అధికారులు సూచిస్తున్నప్పటికీ కింది స్థాయి అధికారులు వాటిని అమలు చేయడం లేదు. అయితే ఆధార్ లింక్ కాని ఓట్లన్నీ దొంగ ఓట్లుగా ఉన్నాయని ప్రతిపక్ష నాయకులు ఆరోపిస్తున్నాయి. గత మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ శివారు ప్రాంతాల్లో అధికార పార్టీ నాయకులు పెద్ద ఎత్తున దొంగ ఓట్లు నమోదు చేయించారని, ఇప్పుడు ఆ ఓట్లకే ఆధార్ లింకు చేయడం లేదని పేర్కొంటున్నారు.

సవాలక్ష కారణాలు అడుగుతున్నారు



అధికారుల తీరుతో ఓటు వేసే అవకాశాన్ని కోల్పోతున్నాం. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయించి, ఫారాన్ని తహసీల్దార్ కార్యాలయానికి తీసుకెళ్తే సవాలక్ష కారణాలు అడుగుతున్నారు. గతంలో ఉన్న ఏరియా నుంచి ఓటు లేనట్లు ధ్రువీకరణ పత్రం తేవాలంటున్నారు. వేరే ప్రాంతాల వారు అధికార పార్టీ నాయకులను కలిసి ఓటును నమోదు చేసుకుంటున్నారు. మాలాంటి సామాన్యులు ఓటు పొందే పరిస్థితి లేదు.

– మాధవరెడ్డి, నందిపాడు

పారదర్శకంగా జరుగుతోంది




ఓటు నమోదు, సవరణ, తొలగింపు పారదర్శకంగా నిర్వహిస్తున్నాం. వచ్చిన దరఖాస్తులను వెంటనే క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నాం. కొత్త ఓట్లను వెంటనే ఆన్‌లైన్ చేసి అప్రూవల్ చేస్తున్నాం. చనిపోయిన వారి, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి ఓట్లను పరిశీలించి తొలగిస్తాం. ఈ నెల 19వరకు కొత్త ఓట్ల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

– చెన్నయ్య, మిర్యాలగూడ ఆర్డీఓ

‘టెట్’కు అంతా సిద్ధం

- మొదటి పేపర్‌కు 52 కేంద్రాలు, రెండవ పేపర్‌కు 49 కేంద్రాలు
- హాజరుకానున్న 23,822 మంది అభ్యర్థులు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు



నల్లగొండ: టెట్ (టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్) నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ పరీక్షలు జరగనున్నాయి. మొదటి పేపర్‌కు 52 పరీక్షా కేంద్రాలు, రెండో పేపర్‌కు 49 కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9.30గంటల నుంచి 12 గంటల వరకు జరగనున్న మొదటి పేపర్‌కు 12,423 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. అదేవిధంగా రెండవ పేపర్ మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగనుంది. ఈ పరీక్షకు 11,399 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు.

మున్సిపాలిటీల్లోనే పరీక్ష కేంద్రాలు..

అనుముల మున్సిపాలిటీలో – 5 పరీక్షా కేంద్రాలు, చండూరు మున్సిపాలిటీలో 4 కేంద్రాలు, చిట్యాల మున్సిపాలిటీలో 6 కేంద్రాలు, దేవరకొండ మున్సిపాలిటీలో 11, మిర్యాలగూడ మున్సిపాలిటీలో 26 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. నల్లగొండ, నకిరేకల్, నాగార్జునసాగర్ మున్సిపాలిటీల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. అధికారులు జిల్లాలోని 150 సెంటర్ల లిస్టును టెట్ కన్వీనర్‌కు సమర్పించగా అందులో 52 సెంటర్లు తీసుకున్నారు. అల్ఫాబెటికల్ ప్రకారం సెంటర్లను ఎంపిక చేయడంతో ×ఎన్‌౯ అక్షరం సీరియల్ రాకముందే సెంటర్లు సరిపోవడంతో నల్లగొండ, నకిరేకల్, నాగార్జున్‌సాగర్ మున్సిపాలిటీల్లో సెంటర్లను ఏర్పాటు చేయలేదని అధికారులు చెబుతున్నారు.

10 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాల ఏర్పాటు

పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు రూట్ ఆఫీసర్, 10 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. ప్రతి బృందంలో తహసీల్దార్, ఎస్ఐ, ఏఎస్ఐ, కానిస్టేబుల్ ఉంటారు. 52 మంది చీఫ్ సూపరింటెండెంట్లను, 52 మంది డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించారు. ప్రతిసెంటర్‌కు ముగ్గురు సూపరింటెండెంట్లు ఉంటారు. అదేవిధంగా ఒక్కో సెంటర్‌కు 11 మంది చొప్పున 572 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు.

ఐదు స్టోరేజీ పాయింట్ల ఏర్పాటు..

జిల్లాలో ఐదు స్టోరేజీ పాయింట్లను ఏర్పాటు చేశారు. హాలియా, చిట్యాల, చండూర్ మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేయగా.. మిర్యాలగూడ పట్టణంలో రెండు పాయింట్లను ఏర్పాటు చేశారు. వీటి వద్ద కట్టుదిట్టమైన భద్రత పెట్టారు.

ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాయాలి

టెట్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. అధికారులకు ఇప్పటికే శిక్షణ ఇచ్చాం. ఇందుకు సంబంధించి అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆదేశాలిచ్చాం. అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా అన్ని చర్యలు చేపట్టాం.

– ఆర్‌వీ కర్ణన్, కలెక్టర్

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

– మూడు క్రస్ట్ గేట్ల ద్వారా దిగువకు నీటి విడుదల



మూసీ ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో దిగువకు పోతున్న వరద నీరు

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద నీటి రాక కొనసాగుతోంది. గురువారం అధికారులు ప్రాజెక్టు మూడు గేట్లను ఎత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికీ ఎగువ ప్రాంతాల నుంచి 2,335 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 645 అడుగుల గరిష్ఠ నీటి మట్టం గల మూసీ రిజర్వాయర్‌లో ప్రస్తుతం 643.84 అడుగుల వద్ద ఉంది. ప్రాజెక్టులో నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరువలో ఉండడంతో అధికారులు ప్రాజెక్టు మూడు క్రస్ట్ గేట్లను రెండు అడుగులు ఎత్తి ఉంచి 3,902 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాల్వల ద్వారా ఆయకట్టు భూములకు 438 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. గేట్ల ద్వారా, కాల్వలకు మొత్తం నుంచి 4,340 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. మూసీ రిజర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.16 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

విధులు సమర్థవంతంగా నిర్వహించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, చిత్రంలో ఎస్పీ అపూర్వరావు, అదనపు కలెక్టర్లు

- కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్
- ఎన్నికల విధులపై అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్

నల్లగొండ: ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలు అనుసరించి రానున్న సాధారణ ఎన్నికల్లో ఎన్నికల విధులను అధికారులు సమర్థవంతంగా నిర్వహించే విధంగా సన్నద్ధం కావాలని కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జీఎం కన్వెన్షన్ హాల్‌లో ఆర్‌ఓలు, ఏఆర్‌ఓలు, సెక్టార్ అధికారులు, జిల్లా ఎన్నికల నోడల్ అధికారులు, పోలీస్ అధికారులు, సెక్టార్ అధికారులకు ఎస్పీ అపూర్వ రావు, అదనపు కలెక్టర్లు హేమంత్ కేశవ్ పాటిల్, శ్రీనివాస్‌లతో కలిసి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా స్థాయి నుంచి మండల, గ్రామ స్థాయి వరకు ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది ఎన్నికల కమిషన్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల్లో నిర్వహించాల్సిన విధులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కలెక్టర్ వివరించారు. సెక్టార్ అధికారులు ఎలాంటి అలసత్వం, నిర్లక్ష్యం లేకుండా, ఎప్పటికప్పుడు ఎన్నికల కమిషన్ నుంచి వచ్చే మార్గదర్శకాలను పాటించాలన్నారు. జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల విధుల పర్యవేక్షణకు 179 మంది సెక్టార్ అధికారులు, పోలీస్ సెక్టార్ అధికారులను నియమించామని తెలిపారు. ఒక సెక్టార్ పరిధిలో 10 నుంచి 12 పోలింగ్ స్టేషన్లు ఉంటాయని పేర్కొన్నారు.

541 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల గుర్తింపు

జిల్లాలోని 1,766 పోలింగ్ కేంద్రాల్లో 541 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించినట్లు కలెక్టర్ చెప్పారు. పోలింగ్‌కు ఐదు రోజుల ముందు ఓటరు స్లిప్పుల పంపిణీ జరిగేలా బూత్ స్థాయి అధికారులను పర్యవేక్షించాలన్నారు. ఎస్పీ అపూర్వరావు మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో సరిహద్దు రాష్ట్రాలు, జిల్లాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలింగ్ గురించి అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ అవగాహన కల్పించారు. సమావేశంలో ఆర్డీఓలు, డీఎస్పీలు, పోలీస్, సెక్టార్ అధికారులు, నోడల్ అధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



శిక్షణకు హాజరైన అధికారులు

ప్రత్యామ్నాయ పంటలకు ప్రణాళిక

- సాగర్ ప్రాజెక్టులో నీరు అడుగంటడంతో ప్రశ్నార్థకంగా సాగునీటి విడుదల
- వర్షాధార పంటలు సాగు చేయించాలని నిర్ణయించిన వ్యవసాయ శాఖ



హాలియాలో బీళ్లుగా మారిన పొలాలు

నల్లగొండ అగ్రికల్చర్: నాగార్జున సాగర్ ప్రాజెక్టులో నీరు అడుగంటడంతో ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ఆయకట్టుకు సాగునీటి విడుదల ప్రశ్నార్థకంగా మారింది. సెప్టెంబర్ చివరి వరకు సాగర్ ప్రాజెక్టుకు నీరు చేరితేనే సాగునీటిని పంటల సాగుకు విడుదల చేసే అవకాశం ఉంది. దీంతో ఆయకట్టు పరిధిలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు వ్యవసాయశాఖ ప్రణాళికలను సిద్ధం చేసింది.

తాగునీటి అవసరాలకు మాత్రమే విడుదల చేసే అవకాశం

ప్రస్తుతం ఉన్న పరిస్థితుల దృష్ట్యా ప్రాజెక్టులో ఉన్న నీటి నిల్వలు కేవలం జంటనగరాలతో పాటుగా జిల్లా తాగునీటి అవసరాలకు మాత్రమే విడుదల చేసే అవకాశం ఉంది. సాగర్ ఆయకట్టు కింద జిల్లాలోని ఎడమకాలువ పరిధిలోని హాలియా వ్యవసాయ డివిజన్, మిర్యాలగూడ వ్యవసాయ డివిజన్‌లో సాగునీటి కింద సాధారణ సాగు విస్తీర్ణం 1,32,593 ఎకరాలు ఉంది. సాగునీరు విడుదల చేస్తే ఆ విస్తీర్ణంలో రైతులు వరిని సాగు చేసే అవకాశం ఉంది. అయితే ప్రస్తుతం ఏర్పడిన వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా సాగర్ ఎడమకాలువ పరిధిలో ఉన్న బోర్ల కింద ఇప్పటి వరకు 80 వేల ఎకరాల్లో వరి, పత్తిని రైతులు సాగు చేస్తున్నట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. అందులో పత్తి 10వేల ఎకరాలు, వరి 70వేల ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే ఇంకా ఎడమకాలువ పరిధిలో 52,593 ఎకరాలు సాగుకు నోచుకోకుండా బీళ్లుగా దర్శనమిస్తున్న పరిస్థితి నెలకొంది.

మెట్ట పంటల సాగుకు ఆసక్తి చూపని రైతులు

ఇప్పటి వరకు సాగునీటి విడుదలపై ఆశలు సన్నగిల్లడంతో ప్రత్యామ్నాయంగా జిల్లా వ్యవసాయ శాఖ వర్షాధార పంటలను సాగు చేయించాలని నిర్ణయించింది. వర్షాధార పంటలైన కంది, బొబ్బర, పెసర, మినుములు, జొన్న, మిర్చి, కూరగాయలు చెరుకు, ఆయిల్‌పామ్ వంటి పంటలు సాగు చేయాలని రైతులకు సూచిస్తుంది. కానీ క్షేత్ర స్థాయిలో మెట్టపంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించకపోవడంతో రైతులు మెట్టసాగుకు అంతగా ఆసక్తి చూపడం లేదు. నాగార్జునసాగర్ ఎడమకాలువ ఆయకట్టు రైతులు మాత్రం వరిసాగుపైనే మొగ్గుచూపుతూ సాగునీటి కోసం ఎదురు చూస్తున్నారు. వ్యవసాయ శాఖ మాత్రం స్వల్పకాలిక రకాల మెట్టపంటల సాగును ప్రోత్సహించాలని యోచిస్తోంది. కాగా.. వర్షాధార పంటలు సాగు చేస్తే అక్టోబర్‌లో వచ్చే తుఫానుల కారణంగా వర్షాలు కురిసి గట్టెక్కే అవకాశం ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

వర్షాధార పంటలు సాగు చేయాలి

సాగునీటి విడుదల ప్రశార్థకంగా ఉంది. ప్రాజెక్టు నిండితే తప్ప నీటి విడుదల సాధ్యం కాదు. అందుకే రైతులు ప్రత్యామ్నాయంగా వర్షాధార మెట్టపంటలు సాగు చేసుకోవాలి. కంది, పెసర, బొబ్బర, మిర్చి, మినుములు, కూరగాయల వంటి పంటలు సాగు చేసుకోవాలి. ఆ దిశగా రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం.

– శ్రవన్‌కుమార్, డీఏఓ

అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచిన అధికారులు

కేతేపల్లి : అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నాలుగు రోజులుగా సమ్మె చేస్తున్నారు. అయితే చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలని జిల్లా అధికారులు ఆదేశించడంతో కేతేపల్లి మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు వేసిన తాళాలను ఐసీడీఎస్ మండల సూపర్‌వైజర్ కళావతి ఆధ్వర్యంలో పగులగొట్టారు. మండలంలో మొత్తం 40 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా పంచాయతీ కార్యదర్శుల సహకారంతో అన్ని కేంద్రాల తాళాలు తెరిచామని ఆమె తెలిపారు. పౌష్టికాహార పంపిణీ బాధ్యతలను ఐకేపీ వీఓఏలకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

వట్టిపల్లికి రాష్ట్ర స్థాయి అవార్డు



మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్ కల్లు స్వాతి

మర్రిగూడ: మండలంలోని వట్టిపల్లి గ్రామానికి స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ -2023లో రాష్ట్ర స్థాయి ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు దక్కింది. గురువారం హైదరాబాద్‌లో పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, జెడ్పీ సీఈఓ ప్రేమకరణ్‌రెడ్డి చేతులమీదుగా సర్పంచ్ కల్లు స్వాతినవీన్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి అక్షిత అవార్డు అందుకున్నారు. వారి వెంట నల్లగొండ డీపీఓ విష్ణువర్ధన్ రెడ్డి, డీఆర్‌డీఓ కాళిందిని, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎంపీఓ యూసుఫ్, స్వచ్ఛ భారత్ కో ఆర్డినేటర్లు శంకర్‌బాబు, మోహినొద్దిన్, ప్రభాకర్‌లు ఉన్నారు. అదేవిధంగా సూర్యాపేట జిల్లా మునగాల మండలంలోని గణపవరం, గరిడేపల్లి మండలంలోని పొనుగోడు గ్రామ పంచాయతీ, యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలంలోని అన్నంపట్ల పంచాయతీలకు అవార్డులు దక్కాయి.

క్లుప్తంగా

పర్సాయపల్లి గ్రామవాసికి ఉపాధ్యాయరత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు వెంకన్న

అర్వపల్లి: మండల పరిధిలోని పర్సాయపల్లి గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు కేసారపు వెంకన్న ఉపాధ్యాయరత్న అవార్డుకు ఎంపికయ్యారు. తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ ప్రభుత్వం–భాషా, సాంస్కృతిక శాఖ సౌజన్యంతో గురువారం హైదరాబాద్‌లో జగతి ఆర్ట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బీసీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, కవి, రచయిత జయరాజు చేతుల మీదుగా ఆయన ఈ అవార్డు అందుకున్నారు. వెంకన్న హైదరాబాద్‌లోని నాగార్జున హైస్కూల్‌లో ఉపాధ్యాయుడుగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా వెంకన్నను గ్రామస్తులు అభినందించారు.

వరకట్న వేధింపు కేసులో మూడేళ్లు జైలు శిక్ష

చివ్వెంల(సూర్యాపేట): వరకట్న వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య చేసుకోగా.. ఈ కేసులో ఆమె భర్తకు మూడేళ్లు జైలు శిక్ష విధిస్తూ సూర్యాపేట జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజగోపాల్ గురువారం తీర్పు వెల్లడించారు. వివరాలు.. నడిగూడెం మండల వేణుగోపాలపురం గ్రామానికి చెందిన జ్యోతుల నాగార్జునకు, హుజూర్‌నగర్‌కు చెందిన మౌనికతో వివాహం జరిగింది. కాగా అదనపు కట్నం తీసుకురావాలని అత్త, మామ, భర్త వేధిస్తుండటంతో 2017లో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకొని మౌనిక ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ఆమె భర్త, అత్తమామలపై పోలీసులు కేసు నమోదు చేశారు. మౌనిక భర్తను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసు గురువారం తుది విచారణకు రాగా.. పలువురు సాక్షులను విచారించిన సూర్యాపేట జిల్లా న్యాయమూర్తి జి. రాజగోపాల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాకి రాంరెడ్డి వాదనలతో ఏకీభవిస్తూ నిందితుడికి మూడేళ్లు జైలు శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు లైజన్ ఆఫీసర్ కె. సురేంద్రబాబు, కోర్టు కానిస్టేబుల్ పాపారావు సహకరించారు.

ఉద్యాన పంటలతో అధిక ఆదాయం



ఉద్యాన పంటలపై అవగాహన కల్పిస్తున్న కేవీకే సీనియర్ శాస్త్రవేత్త లవకుమార్

గరిడేపల్లి: రైతులు ఉద్యాన పంటలు పండించి అధిక ఆదాయం పొందవచ్చని గరిడేపల్లి మండలంలోని గడ్డిపల్లిలో గల కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త బి. లవకుమార్ అన్నారు. దాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో యాద్రాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం నుంచి వచ్చిన రైతులు గురువారం గడ్డిపల్లిలోని కేవీకేను సందర్శించారు. ఈ సందర్భంగా వారికి సమగ్ర, సేంద్రియ వ్యవసాయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు కిరణ్, ఆదర్శ్, సంస్థాన్ నారాయణపురం రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యదర్శి మేఘారెడ్డి, బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ యాదయ్య, భగవంతు కృష్ణారెడకడి, దాన్ ఫౌండేషన్ అసోసియేట్ లావణ్య, మంజుల, జయశ్రీ, అర్చన తదితరులు పాల్గొన్నారు.

తండా నుంచి జాతీయ స్థాయికి..

- వీల్‌చైర్ క్రికెట్‌లో రాణిస్తున్న రంగుండ్ల తండాకు చెందిన వికలాంగ యువకుడు
- అక్టోబర్ 6 నుంచి 11 వరకు నేపాల్‌లో జరిగే ఆసియా కప్‌లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం
- దాతల సాయం కోసం ఎదురుచూపు



వీల్‌చైర్‌లో కూర్చొని క్రికెట్ సాధన చేస్తున్న సురేష్



టీం సభ్యులతో కలిసి ట్రోఫీ అందుకుంటున్న సురేష్ (ఫైల్)

తిరుమలగిరి(నాగార్జునసాగర్): పుట్టిన కొద్ది నెలలకే పోలియో వ్యాధి సోకి వికలాంగుడిగా మారిన ఓ యువకుడు పట్టుదలతో సాధన చేసి వీల్‌చైర్ క్రికెట్‌లో భారతదేశం తరఫున ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఎదిగాడు. వివరాలు.. తిరుమలగిరి(సాగర్) మండలంలోని రంగుండ్ల తండాకు చెందిన ధరావత్ బాలు, మల్లి దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె సంతానం. వారిది నిరుపేద కుటుంబం కావడంతో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. చిన్న కుమారుడు ధరావత్ సురేష్ పుట్టిన ఎనిమిది నెలలకే పోలియో వ్యాధి సోకడంతో వికలాంగుడయ్యాడు. డిగ్రీ పూర్తిచేసిన సురేష్‌కి క్రికెట్ అంటే ఎంతో ఇష్టం. వికలాంగుడైనప్పటికీ పట్టు వదలకుండా ఊత కర్ర సాయంతో గ్రామంలో స్నేహితులతో క్రికెట్ ఆడుతుండేవాడు. ప్రతిరోజు క్రికెట్ సాధన చేస్తూ ఆటలో పట్టు సాధించాడు.

ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ..

సురేష్ 2020లో రాజస్థాన్‌లో నిర్వహించిన నేషనల్ వీల్‌చైర్ క్రికెట్ పోటీలకు ఎంపికయ్యాడు. అక్కడ మంచి ప్రతిభ కనబర్చి బెస్ట్ ఫీల్డర్ అవార్డు అందుకున్నాడు. 2021లో ముంబైలో నిర్వహించిన పోటీల్లో పాల్గొని ప్రతిభ కనబర్చాడు. 2022లో ఢిల్లీలో నిర్వహించిన ఐడబ్ల్యూసీపీఎల్(ఇండియన్ వీల్‌చైర్ క్రికెట్ ప్రీమియం లీగ్)కు ఎంపికై ఉత్తమ ఫీల్డర్‌గా, బ్యాట్స్‌మెన్‌గా రాణించాడు. అతడి ప్రతిభను గుర్తించిన సెలక్టర్లు దేశం తరఫున వీల్‌చైర్ క్రికెట్ జట్టుకు ఎంపిక చేశారు. దివ్యాంగ క్రికెట్ కంట్రోల్ బోర్డ్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నేపాల్ దేశ రాజధాని ఖాట్మాండులో అక్టోబర్ 6వ తేదీ నుంచి 11వ తేదీ వరకు నిర్వహించే దివ్యాంగుల వీల్‌చైర్ ఆసియా కప్ క్రికెట్ టోర్నమెంట్‌కు దేశం తరఫున ఎంపికయ్యాడు.

ఆర్థికంగా ఇబ్బందులతో..

ఆసియా కప్‌లో పాల్గొనేందుకు అక్టోబర్ 1వ తేదీన నేపాల్‌కు వెళ్లాల్సి ఉంది. ఆ టోర్నమెంట్‌లో ఆడాలంటే ముందుగానే దివ్యాంగ క్రికెట్ కంట్రోల్ బోర్డు ఆఫ్ ఇండియాకు రూ.25,000 చెల్లించాల్సి ఉంటుంది. నేపాల్ వెళ్లేందుకు రవాణా ఖర్చులు కూడా ఆటగాళ్లే భరించాల్సి ఉండటంతో దాతల సాయం కోసం సురేష్ ఎదురుచూస్తున్నాడు.

సాయం చేయాల్సిన వివరాలు

బ్యాంక్ అకౌంట్ నంబర్: 104510100129719
(యూనియన్ బ్యాంక్, తిరుమలగిరి బ్రాంచ్)
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్: ఏఎన్‌డీబీ0001045
గూగుల్ పే, ఫోన్ పే నంబర్: 9603311510

గర్వంగా ఉంది



వీల్‌చైర్ క్రికెట్ పోటీల్లో దేశం తరఫున ఆడటం గర్వంగా ఉంది. గత ఐదు సంవత్సరాలుగా పడుతున్న కష్టానికి ఫలితం దక్కింది. ఆసియా కప్‌లో పాల్గొనాలంటే బోర్డుకు కొంత డబ్బు చెల్లించాల్సి ఉంది. దాతలు పెద్ద మనసుస్తో సాయం చేయాలి. – ధరావత్ సురేష్

మంచి పేరు తీసుకొస్తాడు



నా కుమారుడు వికలాంగుడైనప్పటికీ ఆత్మవిశ్వాసం కోల్పోలేదు. పట్టుదలతో దేశం తరఫున క్రికెట్ ఆడే స్థాయికి రావడం సంతోషంగా ఉంది. దాతలు సాయం ఆర్థికసాయం చేస్తే భారతదేశానికి మంచి పేరు తీసుకొస్తాడనే నమ్మకం ఉంది. – ధరావత్ బాలు, సురేష్ తండ్రి

క్రైస్తవులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి



అభివాదం చేస్తున్న క్రైస్తవ ప్రతినిధులు

రామగిరి(నల్లగొండ): వచ్చే అసెంబ్లీ రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని అన్ని పార్టీలు క్రైస్తవులకు తగిన ప్రాధాన్యం కల్పించాలని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు గద్దపాటి విజయరాజు డిమాండ్ చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా క్రైస్తవుల చైర్మన్ రేకల భద్రాద్రి అధ్యక్షతన నల్లగొండ పట్టణంలోని గురువారం నిర్వహించిన క్రైస్తవ సంఘాల ప్రతినిధుల రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పూజారులు, ఇమామ్‌లకు ఇచ్చే విధంగా క్రైస్తవ సేవకులకు కూడా ప్రభుత్వం గౌరవ వేతనం ఇచ్చి చేయూతనివ్వాలన్నారు. దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా కల్పించే విధంగా శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించాలన్నారు. క్రైస్తవ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా గురుకులం ఏర్పాటు చేయాలన్నారు. జీఓ నంబర్ 58, 59 ద్వారా ప్రభుత్వం భూముల్లో నిర్మించుకున్న క్రైస్తవుల ఇళ్లు, చర్చిలు, షెడ్లను రెగ్యులరైజ్ చేసి పట్టాలు ఇవ్వాలన్నారు. తెలంగాణ వ్యాప్తంగా అన్ని పార్టీలు క్రైస్తవులకు మూడు ఎమ్మెల్యే, ఒక పార్లమెంట్, రాజ్యసభ స్థానాలు, రెండు ఎమ్మెల్సీలను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో మోజెస్, రాజు, వేణు, ప్రవీణ్ కుమార్, దినేష్, అనిల్, మణి, ఎలీషా, ఆశయ, ఆనందయ్య తదితరులు పాల్గొన్నారు.

గడ్డి మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

మోత్కూరు: ఆర్థిక ఇబ్బందులతో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో గురువారం వెలుగులోకి వచ్చింది. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మోత్కూరు మున్సిపాలిటీ కేంద్రానికి చెందిన నిలిగొండ లక్ష్మయ్య(38)కు భార్య కనకమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. లక్ష్మయ్య స్థానిక పెద్ద చెరువు కట్ట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయం వద్ద పంక్చర్ దుకాణం నిర్వహిస్తుండడంతో పాటు వ్యవసాయ పంటలకు పురుగు మందు పిచికారీ చేసేందుకు కూలికి సైతం వెళ్లేవాడు. కొంతకాలంగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న లక్ష్మయ్య మనస్తాపంతో బుధవారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలో బిక్కేరు వాగు సమీపంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా.. వారు వచ్చి అతడిని సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు.

గుడివాడ గ్రామంలో విషాదఛాయలు



మృతుల కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కేతేపల్లి: నకిరేకల్ మండలంలోని తాటికల్ గ్రామ శివారులో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో కేతేపల్లి మండలంలోని గుడివాడ గ్రామానికి చెందిన నవ దంపతులు చిత్తలూరి మహేష్, రిషిత మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. నెల రోజుల కిత్రమే ప్రేమించి పెళ్లి చేసుకున్న యువ జంట రోడ్డు ప్రమాదంలో మృతి చెందటంతో వారి కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం గురువారం సాయంత్రం గుడివాడకు తీసుకొచ్చారు. మృతులను చూసేందుకు భారీగా బంధువులు, గ్రామస్తులు తరలివచ్చారు. అంతకుముందు నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రిలో మృతదేహాలను స్థానిక ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, టీపీసీసీ మాజీ కార్యదర్శి దైద రవీందర్‌లు వేర్వేరుగా సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. వారి వెంట నకిరేకల్ ఏఎంసీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్, గుడివాడ సర్పంచి కట్ట శ్రవణ్, మాజీ సర్పంచ్ ఎస్‌కే లతీఫ్ తదితరులు ఉన్నారు.

మిల్లులో నెట్ కూలి ఐదుగురికి తీవ్రగాయాలు

మునగాల(కోదాడ): మండల కేంద్రంలోని ఓ రైస్ మిల్లులో గురువారం ధాన్యం బస్తాల నెట్ కూలి ఐదుగురు కూలీలకు గాయాలయ్యాయి. హమాలీ యూనియన్ నాయకుడు తెలిపిన వివరాల ప్రకారం .. మునగాల మండల కేంద్రంలోని నాగార్జున మోడ్రన్ రైస్ మిల్లులో హమాలీలు ధాన్యం బస్తాలను బడ్డీలో పోస్తుండగా ప్రమాదవశాత్తు నెట్ కూలిపోయి వారిపై పడింది. ఈ ప్రమాదంలో మునగాల మండలంలోని కొక్కిరేణి గ్రామానికి చెందిన రావులపెంట సైదులు, పిల్లుట్ల సైదులు, తాడువాయి తండాకు చెందిన మాలోతు గన్యా, నునావత్ సుందరయ్య, మునగాల మండల కేంద్రానికి చెందిన లంజేపల్లి ఏసుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను సహచర హమాలీలు చికిత్స నిమిత్తం సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. రావులపెంట సైదులు, లంజేపల్లి ఏసు, మాలోతు గన్యాను మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌కు, పిల్లుట్ల సైదులు, నునావత్ సుందరయ్యను ఖమ్మంకు తరలించారు. కాగా ఈ ప్రమాదానికి సంబంధించి స్థానిక ఎస్‌ఐ పి. లోకేష్‌ను వివరణ కోరగా.. తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని, స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. క్షతగాత్రులలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

అదుపుతప్పి లారీ బోల్తా



బోల్తా పడిన ధాన్యం లారీ

తిరుమలగిరి (తుంగతుర్తి): మండల కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్ కాలనీ సమీపంలో గురువారం తెల్లవారుజామున నకిరేకల్ వైపు ధాన్యం లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి డివైడర్ పైకి ఎక్కి బోల్తా పడింది. దీంతో ధాన్యం బస్తాలు రోడ్డుపై పడిపోయాయి. లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా, వేగంగా లారీ నడపడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు పేర్కొన్నారు.

బైక్‌ను ఢీకొట్టిన కారు.. ఒకరికి గాయాలు

రామగిరి(నల్లగొండ): బైక్‌ను కారు ఢీకొట్టడంతో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం తిప్పర్తి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు.. యాదాద్రి భువనగిరి జిల్లాలోని పోచర్లబోడ్ తండాకు చెందిన ధారావత్ రాకేష్(21) మిర్యాలగూడ నుంచి నల్లగొండ వైపునకు బైక్‌పై వెళ్తుండగా.. అదే సమయంలో నల్లగొండ నుంచి మిర్యాలగూడకు వెళ్తున్న కారు తిప్పర్తి పోలీస్ స్టేషన్ సమీపంలో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రాకేష్ ఎడవ కాలు విరిగింది. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నల్లగొండ పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

టోల్‌ప్లాజా వద్ద వాహనాల తనిఖీ



కొర్లపహాడ్ టోల్‌గేట్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఆర్టీసీ, పోలీసు అధికారులు

కేతేపల్లి: మండలంలోని కొర్లపహాడ్ టోల్‌ప్లాజా వద్ద గురువారం జిల్లా పోలీసులు, ఆర్టీసీ అధికారులు సంయుక్తంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులతో వెళ్తున్న ప్రతి ప్రైవేట్ వాహనాన్ని అధికారులు తనిఖీ చేశారు. వ్యక్తిగత వాహనం పేరుతో రిజిస్ట్రేషన్ నమోదు చేయించి అక్రమంగా ప్రయాణికులను తీసుకెళ్తున్న వాహనాలను గుర్తించి కేసులు నమోదు చేశారు. జరిమానాలు విధించారు. ఆయా వాహనాలలోని ప్రయాణికులను కిందకు దింపి ఆర్టీసీ బస్సులలో ఎక్కించి వారి గమ్యస్థానాలకు పంపించారు.

వాటర్ హీటర్‌ను పట్టుకొని బాలుడి మృతి



బిట్టు (ఫైల్)

కోదాడ రూరల్ : అభం శుభం తెలియని ఏడాది వయస్సున్న బాలుడు వాటర్‌హీటర్‌ను పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఈ సంఘటన కోదాడ మండల పరిధిలోని రామలక్ష్మీపురంలో గురువారం చోటుచేసుకుంది. పాముల వెంకటనారాయణ, శిరీషా దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. గురువారం ఉదయం శిరీషా పెద్ద కుమారుడిని పాఠశాలకు పంపించడానికి వెళ్లగా, వెంకటనారాయణ కూలీ పనికి వెళ్లాడు. ఏడాది వయస్సున్న చిన్న కుమారుడు బిట్టు ఇంట్లో ఆడుకుంటూ వెళ్లి.. వేడి నీటి కోసం పెట్టి ప్లగ్‌తీయని వాటర్ హీటర్‌ను పట్టుకోవడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. కొద్దిసేపటి తర్వాత బాలుడి నాయనమ్మ గమనించగా అప్పటికే బాలుడు కిందపడి మృతిచెంది ఉన్నాడు.

రేషన్ బియ్యం కొనుగోలుపై అన్నదమ్ముల మధ్య వాగ్వాదం

చిలుకూరు: లబ్ధిదారుల నుంచి రేషన్ బియ్యం కొనుగోలు చేసే విషయమై గురువారం చిలుకూరు గ్రామంలో ఇద్దరు అన్నదమ్ములు బహిరంగంగా వాగ్వాదానికి దిగారు. చిలుకూరు గ్రామంలోని శివాలయం వద్ద ఇద్దరు అన్నదమ్ములు రేషన్ బియ్యంను అక్రమంగా కొనుగోలు చేస్తుండడమే కాకుండా, బియ్యం కొనుగోలు విషయంలో ఘర్షణకు దిగారు. దీనిపై చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. కొంత కాలంగా వారిద్దరు రేషన్ బియ్యం ఇచ్చే సమయంలో ఏకంగా ఆ రేషన్ షాపు ఉండే బజారులోనే తిష్ట వేసి లబ్ధిదారుల నుంచి బహిరంగంగా బియ్యం కొనుగోలు చేస్తున్నారని పలువురు గ్రామస్తులు అంటున్నారు.

ఆస్తి పంపకాల తర్వాతే దహన సంస్కారాలు

- తమ పేరిట భూమి పట్టా చేసేదాకా సోదరుడి అంత్యక్రియలను అడ్డుకున్న అన్నదమ్ములు

మోతె: ప్రస్తుత సమాజంలో మానవ సంబంధాల కంటే ఆస్తులే ముఖ్యంగా మారాయి. ఇలాంటి ఘటనే మోతె మండల పరిధిలో సిరికొండ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... సిరికొండ గ్రామానికి చెందిన వెంపటి సత్యనారాయణ(63), భాగ్యమ్మ భార్యాభర్తలు. వీరికి సంతానం లేదు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య గొడవలు జరుగుతుండడంతో సత్యనారాయణ తన సోదరుల వద్ద ఉంటున్నాడు. భాగ్యమ్మ కూడా ఆమె సోదరుల వద్దే ఉంటుంది. ఇటీవల సత్యనారాయణ క్యాన్సర్ బారిన పడడంతో వైద్యం కోసం అతడి సోదరులు లక్షల రూపాయలు అప్పు చేసినట్లు చెబుతున్నారు. భాగ్యమ్మకు సిరికొండలో తన తల్లిగారు ఇచ్చిన నాలుగు ఎకరాల వ్యవసాయ భూమి ఆమె పేరునే ఉంది. భాగ్యమ్మ పేరిట ఉన్న నాలుగెకరాల భూమిలో ఎకరం సత్యనారాయణ పేరున రిజిస్ట్రేషన్ చేసేందుకు ఇటీవల గ్రామ పెద్దలు నిర్ణయించి సోమవారం ధరణిలో స్లాట్ బుక్ చేశారు. మంగళవారం రిజిస్ట్రేషన్ కోసం తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లాల్సి ఉండగా.. అదే రోజు సత్యనారాయణ మృతిచెందాడు. అయితే సత్యనారాయణ వైద్యం కోసం రూ.30లక్షలు ఖర్చు చేశామని, ఎకరంన్నర భూమి తమ పేరిట రిజిస్ట్రేషన్ చేయాలని అతడి సోదరులు పట్టుబట్టారు. భూమి రిజిస్ట్రేషన్ చేసే దాకా దహన సంస్కారాలు చేయకుండా అడ్డుకున్నారు. ఇదే అదనుగా భావించి భాగ్యమ్మ సోదరులు, వారి కుటుంబ సభ్యులు తమ పేరిట కూడా భూమి పట్టా చేయాలని పట్టుబట్టారు. బుధవారం సత్యనారాయణ సోదరులు ఎకరంన్నర భూమి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. భాగ్యమ్మ వదిన, మరదలు చెరో అరెకరం భూమి పట్టా చేయించుకునేందుకు ధరణిలో స్లాట్ బుక్ చేయించుకున్నారు. అనంతరం సాయంత్రం వెళ్లి సత్యనారాయణ అంత్యక్రియలు నిర్వహించారు. రిజిస్ట్రేషన్ కోసం సత్యనారాయణ మృతదేహాన్ని ఇంటి ముందే వదిలి వెళ్లడంతో అతడి తల్లి కాపలా కాయడం చూసి పలువురు కంటతడి పెట్టారు.

గిరిజన బాలికల హాస్టల్‌లో విద్యార్థినులకు అస్వస్థత

మిర్యాలగూడ: పట్టణంలోని ఖమ్మం రోడ్డులో గల గిరిజన బాలికల హాస్టల్‌లో గురువారం ఏడుగురు విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. 9, 10 తరగతులు చదివే వడిత్య అనూష, చిట్టి, సంధ్యతో పాటు మరో నలుగురు విద్యార్థినులు కడుపునొప్పితో అస్వస్థతకు గురయ్యారు. వారికి మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. అనూష ప్రస్తుతం ఆస్పత్రిలోనే చికిత్స పొందుతుంది. ఈ ఘటన గురువారం ఉదయం జరిగినప్పటికీ విషయం బయటకు రాకుండా హాస్టల్ వార్డెన్ గోప్యంగా ఉంచారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

బీజేపీ కుట్రలను తిప్పికొట్టాలి

భువనగిరి: తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను వక్రీకరించేందుకు బీజేపీ చేస్తున్న కుట్రలను తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ అన్నారు. భువనగిరి మండలం బస్వాపురంలో నిర్వహిస్తున్న పార్టీ రాజకీయ శిక్షణ తరగతులకు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాటాన్ని హిందువులు, ముస్లిం రాజుకు మధ్య జరిగిన యద్ధంగా బీజేపీ చిత్రీకరించడం సరికాదన్నారు. సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా 17న భూదాన్‌పోచంపల్లి మండలం పిల్లాయిపల్లి గ్రామం నుంచి జిల్లా జాత ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాటూరి బాలరాజు, మండల కార్యదర్శి దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శి వర్గ సభ్యులు పల్లెర్ల అంజయ్య తదితరులు పాల్గొన్నారు.


యాదాద్రిలో ఉత్తరప్రదేశ్ రాష్ట్ర మంత్రి పూజలు



మంత్రి రవీంద్ర జైశ్వాల్‌కు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న నర్సింహమూర్తి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనర్సింహస్వామిని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర స్టాంప్స్ అండ్ కోర్టు ఫీ, రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి రవీంద్ర జైశ్వాల్ గురువారం రాత్రి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆయనకు సంప్రదాయంగా స్వాగతం పలికారు. మంత్రి గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో మంత్రికి ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, ఆలయ అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి లడ్డూ ప్రసాదం అందజేశారు.

వీర్లపాలెం లైన్‌మెన్‌పై సస్పెన్షన్ వేటు



లైన్‌మెన్ శ్రీనివాస్ ఇంటికి సస్పెన్షన్ ఉత్తర్వులు అంటిస్తున్న అధికారి

మిర్యాలగూడ అర్బన్: దామరచర్ల మండలం వీర్లపాలెంలో విధులు నిర్వహిస్తున్న ట్రాన్స్‌కో లైన్‌మెన్ గుంటూరు శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తూ డీఈ వెంకటేశ్వర్లు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రమోషన్ విషయంలో తన నుంచి లంచం డిమాండ్ చేసిన మిర్యాలగూడ డీఈతో పాటు మరో ఇద్దరు ఉద్యోగులను లైన్‌మెన్ శ్రీనివాస్ గత సంవత్సరం ఏసీబీకి పట్టించాడు. ఆ కేసు ప్రస్తుతం కోర్టు విచారణలో ఉంది. ఇటీవల మరోసారి తన ప్రమోషన్ గురించి ఉన్నతాధికారులను అడగగా.. ఏసీబీ కేసుతో లింక్ పెట్టి దానిని విత్‌డ్రా చేసుకోవాలని ఇబ్బందులు పెడుతున్నారని ఇటీవల శ్రీనివాస్ మిర్యాలగూడ డీఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆరోపించాడు. కాగా ఉన్నతాధికారుల అనుమతి లేకుండా డీఈ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టి అసత్య ఆరోపణలు చేసిన లైన్‌మెన్ శ్రీనివాస్‌ను విధుల నుంచి తప్పిస్తున్నట్లు డీఈ తెలిపారు. లైన్‌మెన్ శ్రీనివాస్ గతంలో తన విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సర్వీస్ రికార్డులో ప్రమోషన్ పనిష్మెంట్ విధించినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా డిపార్ట్‌మెంట్ ప్రమోషన్లకు సంబధించిన కేసు హైకోర్టులో నడుస్తుండగా పదోన్నతి ప్రక్రియలో పురోగతి లేదన్నారు. ఈ విషయంపై లైన్‌మెన్‌కు అవగాహన ఉన్నప్పటికీ ఉద్దేశపూర్వకంగా అధికారులపై నిందలు మోపాడని డీఈ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించి అధికారులపై అసత్య ఆరోపణలు చేస్తున్నందుకుగాను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు లైన్‌మెన్ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు డీఈ పేర్కొన్నారు. కాగా సస్పెన్షన్ ఉత్తర్వులను స్వీకరించేందుకు లైన్‌మెన్ శ్రీనివాస్ నిరాకరించడంతో అతడి ఇంటి గోడకు అంటించామని డీఈ తెలిపారు. ఆయన వెంట రూరల్ ఏడీఈ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

ఆ విగ్రహం జాడేదీ..?

- అంతంపేటలో చోరీకి గురైన ముత్యాలమ్మ విగ్రహం
- ఏడాదిన్నరవుతున్నా ఆచూకీ కనిపెట్టని పోలీసులు



చోరీకి గురైన విగ్రహం ఇదే..

చండూరు(గట్టుప్పల్): గట్టుప్పల్ మండల పరిధిలోని అంతంపేట గ్రామంలో రెండు సంవత్సరాల క్రితం లభించిన కోట్ల విలువైన ముత్యాలమ్మ విగ్రహం జాడ కనిపించడం లేదు. దొంగిలించబడిన ఆ విగ్రహం గురించి పోలీసులు నెల రోజులు హడావుడి చేశారే తప్ప జాడ కనుక్కోలేకపోయారు. వివరాలు.. అంతంపేట గ్రామ శివారులోని ముత్యాలమ్మ దేవాలయంలో గల వేప చెట్టు వేర్లలో 2021 జూన్ 24న ముత్యాలమ్మ విగ్రహం(సుమారుగా 2 కిలోల600 గ్రాములు) గ్రామస్తులకు లభ్యమైంది. ముత్యాలమ్మ ఆలయంలో భద్రత సరిగ్గా లేని కారణంగా గ్రామస్తులు ఆ విగ్రహాన్ని అదే గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధి ద్వారా ఆంజనేయస్వామి దేవాలయంలో భద్రపరిచి తాళం వేసి తాళంచెవిని ఆ ప్రజాప్రతినిధి, ఆలయ కమిటీ సభ్యుల దగ్గరే ఉంచారు. కాగా 2022 ఏప్రిల్ 2న ఆంజనేయస్వామి ఆలయంలో ముత్యాలమ్మ విగ్రహం కనిపించలేదు. దేవాలయానికి తాళాలు మాత్రం వేసి ఉన్నాయి. గ్రామస్తులు సమాచారం మేరకు పోలీసులు అనుమానాస్పద వ్యక్తులను విచారించి క్లూస్ టీం ద్వారా వేలిముద్రలు సేకరించారు. అప్పటి నుంచి నేటి వరకు ఆ విగ్రహం జాడ కనిపించకుండా పోయింది.

బంగారమా.. పంచలోహమా..

లభ్యమైన విగ్రహం ముమ్మాటికి బంగారమేనని గ్రామస్తులు చెబుతున్నారు. కొంతమంది మాత్రం అది పంచలోహ విగ్రహమంటున్నారు. ఆ విగ్రహానికి సుమారు రూ.3కోట్లకు పైచిలుకు వరకు విలువ ఉంటుందని ఆ గ్రామ ఎంపీటీసీ నేనావత్ బంతిలాల్ చెబుతున్నారు. కొంతమంది డబ్బు కోసం ఆ వివిగ్రహాన్ని మాయం చేశారని ఆయన ఆరోపిస్తున్నారు.

కఠినంగా శిక్షించాలి

కోట్ల విలువైన విగ్రహాన్ని దొంగిలించిన వ్యక్తులను గుర్తించి కఠినంగా శిక్షించాలి. పోలీసులు విచారణ వేగవంతం చేయాలి. గతంలో ఒకసారి ఎస్పీకి ఫిర్యాదు చేశామని, సోమవారం మరోసారి ఎస్పీకి ఫిర్యాదు చేస్తాం. – నేనావత్ బంతిలాల్, ఎంపీటీసీ, అంతంపేట

క్లుప్తంగా

నేడు సర్వసభ్య సమావేశం

శాలిగౌరారం : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ లక్ష్మయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రభుత్వ శాఖల అధికారులు ఆయా శాఖల సమగ్ర ప్రగతి నివేదికలతో నిర్ణీత సమయానికి హాజరుకావాలని కోరారు.

హిందీ భాషా దినోత్సవం

చండూరు(గట్టుప్పల్) : జాతీయ హిందీ భాషా దినోత్సవాన్ని గురువారం తేరట్‌పల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ ఉపాధ్యాయుడు ఉదావత్ లచ్చిరాం విద్యార్థులకు హిందీ భాషా దినోత్సవంపై అవగాహన కల్పించారు. విద్యార్థులకు చిత్రలేఖనం, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు సాయిరాం, నరసింహ, రాణి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

విద్రోహ దినంగా పాటించాలి

నకిరేకల్ : సెప్టెంబర్ 17న తెలంగాణ విద్రోహ దినంగా పాటించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమాక్రసీ జిల్లా నాయకుడు అంబటి చిరంజీవి అన్నారు. నకిరేకల్‌లోని యానాల మల్లారెడ్డి స్మారక భవనంలో గురువారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. అంబటి వెంకన్న, చెరుకు సైదులు, అంబటి నర్సయ్య, పసుపులేటి సోమయ్య, నాగయ్య పాల్గొన్నారు.

ఇంటింటికి మట్టి సేకరణ

చిట్యాల : మేరీ మాటి మేరా దేశ్ కార్యక్రమంలో భాగంగా చిట్యాల మండలం గుండ్రాంపల్లి గ్రామంలో బీజేపీ నాయకులు గురువారం ఇంటింటికి తిరిగి మట్టి సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఆ గ్రామ 63వ బూత్ బీజేపీ అధ్యక్షుడు రాచకొండ నరేష్, పాపని వనజ వాసుదేవ్, గరిషే శ్రీనివాస్, సోమగోని నర్సింహ, జవాజీ రమేష్, గరిషే ఎల్లయ్య, మైల పరమేష్, శంకర్, శేఖర్, వెంకటేశం, నీల నర్సింహ పాల్గొన్నారు.

బ్యాంకు రుణాలు ఇవ్వాలి

చండూరు : వ్యాపార ఔత్సాహికులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇవ్వాలని, అదేవిధంగా రుణ మేళా నిర్వహించాలని కోరుతూ ఐఎన్‌టీయూసీ, కాంగ్రెస్ బీసీ సెల్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఎస్‌బీఐ మేనేజర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ మునుగోడు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు రఫీ, కాంగ్రెస్ పార్టీ బీసీ సెల్ మున్సిపల్ అధ్యక్షుడు గండూరి నరసింహ ముదిరాజ్, ఉపాధ్యక్షుడు గుంటి మధు, ప్రధాన కార్యదర్శి ఇడికూడ నరేందర్, అశోక్ పాల్గొన్నారు.

ఆచార్య ఆత్రేయకు నివాళి

రామగిరి(నల్లగొండ): మనసు కవి ఆచార్య ఆత్రేయ వర్ధంతిని ఎన్జీ కళాశాలలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆత్రేయ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ కవి రఘువీర్ ప్రతాప్, తెలుగు శాఖ అధ్యక్షుడు డాక్టర్ తండు కృష్ణకౌండిన్య, మాదగాని శంకరయ్య, దీకొండ వెంకటేశ్వర్లు, డాక్టర్ షేక్ హేస్సేనా, సాగర్ల సత్తయ్య, సిలువేరు లింగమూర్తి, దాసోజు శ్రీనివాసచారి, బండారు శంకర్, దాసోజు జ్ఞానేశ్వర్, దేవదానం, డి.రవి పాల్గొన్నారు.

జీపీ కార్మికులు మరో పోరాటానికి సిద్ధం కావాలి

నల్లగొండ టూటౌన్ : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తామని చర్చలు జరిపి, మోసగించిన ప్రభుత్వంపై మరో పోరాటానికి కార్మికులు సిద్ధం కావాలని తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాలడుగు సుధాకర్ అన్నారు. గురువారం నల్లగొండలోని దొడ్డి కొమరయ్య భవన్‌లో నిర్వహించిన యూనియన్ జిల్లా కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మంత్రి హామీతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేశామని, అక్టోబర్ 2 నుంచి సమ్మెకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నపాక లక్ష్మీనారాయణ, పోతెపాక వినోద్‌కుమార్, పొన్న అంజయ్య, నరసింహ, ఏర్పుల సైదులు, యాదగిరి, రమేష్, చంద్రయ్య, ఎల్లేష్, కోటయ్య పాల్గొన్నారు.

'ప్రైవేట్ విద్యారంగానికి కొమ్ముకాస్తున్న ప్రభుత్వాలు'

నల్లగొండ టూటౌన్ : విద్యారంగానికి సరిపడా నిధులు కేటాయించకుండా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేట్ విద్యారంగానికి కొమ్ము కాస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ అన్నారు. గురువారం నల్లగొండలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో జరిగిన జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బరిగెల వెంకటేష్, జిల్లా కార్యదర్శి మురళీకృష్ణ, అర్జున్, శంషుద్దీన్, వినయ్, మహేందర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

నల్లగొండ : తమ ఉద్యోగాలను రెగ్యులరైజేషన్ చేయాలని డిమాండ్ చేస్తూ సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులు గురువారం కలెక్టరేట్ ఎదుట భజన కార్యక్రమాల ద్వారా నిరసన తెలిపారు. వీరి సమ్మెకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు సుధాకర్, శరత్ యామిని, సాగర్, వాణి, శ్రీనివాస్, సత్యనారాయణ మద్దతు తెలిపారు. కామనబోయిన కేశవులు, కాట్రోతు బీచ్యానాయక్, అంబర్ల సత్యనారాయణ, చందు, నర్సింగ్ దేవదాను, లక్ష్మి, చంద్రమౌళి, మొలుగూరి చందపాక పాల్గొన్నారు.

ప్రబలుతున్న జ్వరాలు..

- గ్రామాల్లో అవగాహన కల్పించని అధికారులు
- మర్రిగూడ ఆస్పత్రికి పెరిగిన ఇన్‌పేషెంట్ల సంఖ్య



మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

మర్రిగూడ : సీజనల్ వ్యాధులతోపాటు విష జ్వరాలు విజృంభిస్తుండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యం అందించినప్పటికీ తగ్గకపోవడంతో మర్రిగూడ మండలంలోని పలువురు జ్వర పీడితులు ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. మర్రిగూడ ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో నిత్యం ఓపీ సంఖ్య 150 నుంచి 200 వరకు ఉంటోంది. రెండు వారాల నుంచి ఆ సంఖ్య పెరిగి 200 నుంచి 300 వరకు చేరిందంటే విష జ్వరాలు ఏ స్థాయికి చేరాయో అర్థం చేసుకోవచ్చు. ఇటీవల ఇన్‌పేషెంట్ల సంఖ్య 25 నుంచి 30 వరకు పెరిగింది. మండల ప్రజలతోపాటు సమీప మండలాలైనా నాంపల్లి, చింతపల్లి, మాల్, గట్టుప్పల్ ప్రజలు మర్రిగూడ ఆస్పత్రికి వైద్యం కోసం వస్తున్నారు.

పరిసరాల అపరిశుభ్రత..

గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్ల సమీపంలో పిచ్చి మొక్కలు ఏపుగా పెరగడం, నీరు నిల్వ ఉండడం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడంతో ఈగలు, దోమలు వ్యాప్తి చెంది పలు వ్యాధులకు కారణమవుతున్నాయి. దీంతో ప్రజలు విష జ్వరాలతోపాటు సీజనల్ వ్యాధులైన టైఫాయిడ్, డెంగ్యూ, మలేరియా బారిన పడుతున్నారు. రెండు వారాల క్రితం కమ్మగూడ గ్రామ పరిధిలోని భోజ్యతండాకు చెందిన 14 ఏళ్ల బాలికకు డెంగ్యూ జ్వరం సోకినట్లు వైద్యులు నిర్ధారించారు. విష జ్వరాల వ్యాప్తిని నివారణకు ముందస్తుగా అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్న రోగులు

మర్రిగూడ ప్రభుత్వ ఆస్పత్రిలో టీ హబ్ ద్వారా రోగులకు నిత్యం పరీక్షలు చేస్తుంటారు. ఆర్ఎస్‌పీ, ఎల్ఎస్‌పీ, లిక్విడ్ ప్రొఫైల్, ఆర్‌డీఎస్, టీబీసీ, టీబీపీ, ఈఎస్ఆర్, హెచ్‌బీఏ1సీ, సీరం యూరిక్, సీరం ఎఎంవైఎల్ఏఎస్ఈ, మైక్రో బయాలజీ టెస్టులు, టైఫాయిడ్‌తోపాటు మలేరియా, టీబీ, హెచ్ఐవీ టెస్టులు చేస్తుంటారు. ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే రోగులకు సరైన వైద్యం అందకపోవడంతో జ్వరం తగ్గక ఆర్ఎంపీలను ఆశ్రయిస్తున్నారు. ఆస్పత్రితో ప్రత్యేక వైద్యులు పూర్తిస్థాయిలో అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. గైనకాలజిస్ట్ లేకపోవడంతో మహిళా రోగులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి మర్రిగూడ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని మండలంలోని ప్రజలు కోరుతున్నారు.

ముందస్తు చర్యలు తీసుకోవాలి



నా కూతురుకి జ్వరం రావడంతో ఊర్లో చూపిస్తే తగ్గలేదు. మూడు రోజులకు మించి జ్వరం ఉందని ప్రభుత్వ ఆస్పత్రికి వస్తే పరీక్షలు చేశారు. డెంగ్యూ జ్వరమని చెప్పారు. మూడు రోజులు ఆస్పత్రిలోనే ఉండి చికిత్స పొందాం. జ్వరాలు రాకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

–ముదావత్ పద్మ, కమ్మగూడ, బోజ్యాతండా

సూది, రెండు గోలీలు ఇచ్చారు



రెండు రోజుల నుంచి కాళ్లు చేతులు లాగుతున్నాయి, నీరసంగా ఉంటోంది. ఆకలి వేయడం లేదని ఆస్పత్రికి వస్తే సూది ఇచ్చి రెండు గోలీలు ఇచ్చి వెళ్లమంటున్నారు. గ్లూకోజ్ పెట్టాలని కోరినా డాక్టర్లు వద్దంటున్నారు. గ్లూకోజ్ పెడితే కాస్త నీరసం తగ్గుతుందనుకున్నా. కాని గ్లూకోజ్ పెట్టలేదు.

–బచ్చనబోయిన ముత్తమ్మ, లింగోటం

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నాం. భోజ్యాతండా గ్రామంలో నీరు అధికంగా నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ చేయించడంతోపాటు దోమల నివారణకు ఫాగింగ్ చేయించాం. ప్రతి ఫ్రైడే డ్రైడేగా పాటిస్తూ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ప్రజలు తగు జాగ్రత్తలు పాటించాలి.

–డాక్టర్ శంకర్‌నాయక్, ఆస్పత్రి సూపరింటెండెంట్

పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

నల్లగొండ : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు శాతం పెంచి పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక సెయింట్ ఆల్ఫాన్సెస్ స్కూల్‌లో నల్లగొండ మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన గురుపూజోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉపాధ్యాయులు తమ హక్కులతోపాటు బాధ్యతగా పనిచేసి విద్యార్థుల భవిష్యత్‌కు పునాదులు వేయాలన్నారు. ఈ సందర్భంగా మండల ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కత్తుల అరుంధతి, ఎఫ్ఎల్ఎన్ మోడల్ ఆఫీసర్ ఉమామహేశ్వరచారి, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు చామల చంద్రశేఖర్, ధర్మానాయక్, జయరాములు, నిర్మల్ రెడ్డి, వివిధ సంఘాల నాయకులు ఫణికుమార్, ఎడ్ల సైదులు, తరాల పరమేష్‌యాదవ్, బత్తుల భాస్కర్, వీరమల్ల శ్రీనివాస్, కుమారయ్య, కడారి కృష్ణ, వెంకులు, షాహిన్ తయాబ్ పాల్గొన్నారు.

ఆర్యసమాజ్ సేవలు అభినందనీయం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న ఆర్యసమాజ్ సభ్యులు

రామగిరి(నల్లగొండ) : ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఆర్య ప్రతినిధి సభ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హరికిషన్ వేదాలంకర్ అన్నారు. నల్లగొండ పట్టణంలోని ఆర్య సమాజ్ మందిరంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న శ్రావణమాస చతుర్వేద మహాకృతువు పూర్ణాహుతి కార్యక్రమానికి గురువారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చతుర్వేద మహాకృతువు కార్యక్రమాలు, భగవంతుడి సేవ, యజ్ఞం చేయడం వల్ల వాతావరణంలో కాలుష్యం తొలగి సకాలంలో వర్షాలు కురుస్తాయని అన్నారు. వేద విజ్ఞాన ప్రచారం వల్ల సమాజంలో మూఢవిశ్వాసాలు కుల, మత భేదాలు నశించి భారతీయ సంస్కృతి అభివృద్ధి చెందుతుందన్నారు. ఆర్య సంఘం ప్రతినిధులు విజసుందర్, సుధాకర్ పండిత్ నరేంద్ర, ఆర్య సమాజ్ అధ్యక్షుడు బోయినపల్లి కృష్ణారెడ్డి, కార్యదర్శి గోపాల్‌రెడ్డి, కోశాధికారి కోటయ్య పండిత్, వేద మిత్ర కంది సూర్యనారాయణ, రవీందర్‌రావు శంకర్, నరసింహాచారి, శంకరయ్య, సాయిబాబా, లక్ష్మీ నర్సు, సత్తయ్య, శశిరేఖ, జయప్రద, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డి అరెస్ట్‌కు నిరసనగా దిష్టిబొమ్మ దహనం



నల్లగొండ టూటౌన్ : రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి. కిషన్‌రెడ్డిని అరెస్ట్ చేయడాన్ని ఖండిస్తూ బీజేపీ నాయకులు గురువారం నల్లగొండ పట్టణంలోని సుభాష్ విగ్రహం వద్ద రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కిషన్‌రెడ్డిని దీక్ష చేపడితే కేసీఆర్ ప్రభుత్వం అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఈ కార్యక్రమంలో వీరెల్లి చంద్రశేఖర్, డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి, దాసోజు యాదగిరాచారి, ఐతరాజు సిద్ధు, పాలకూరి రవిగౌడ్, పోతెపాక లింగస్వామి, రావెళ్ల కాశమ్మ, కంచర్ల విద్యాసాగర్‌రెడ్డి, కాలం విజయేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల రాస్తారోకో

చండూరు : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా బీజేపీ నాయకులు మండల కేంద్రంలో గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అన్నెపర్తి యాదగిరి, మండల అధ్యక్షుడు కొరిమి ఓంకారం, కొత్తపాటి సతీష్, ప్రధాన కార్యదర్శులు పందుల సత్యం గౌడ్, ముదిగొండ ఆంజనేయులు, యువ మోర్చా అధ్యక్షుడు సోమ శంకర్, చిట్టిపోలు వెంకటేశం, బోడ వెంకటేశం, గంట నాగరాజు, ఇడికోజు నాగరాజు, ప్రవీణ్, మాదగోని స్వామి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల : హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి చేపట్టిన నిరసన దీక్షను భగ్నం చేసినందుకు నిరసనగా చిట్యాలలో బీజేపీ నాయకులు గురువారం సీఎం కేసీఆర్ చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు పోరెడ్డి నర్సింహారెడ్డి, మండల రూరల్ అధ్యక్షుడు పొట్లపల్లి నర్సింహగౌడ్, మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలు పాపని వజన, వాసుదేవ్, పార్టీ మండల సహ ఇన్‌చార్జ్ చికిలంమెట్ల అశోక్, జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె వెంకన్న, కోళ్ళ స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

కేతేపల్లి : మండలంలోని రాయపురంలో గురువారం నకిరేకల్ లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రోగ్రాం చైర్మన్, డిస్ట్రిక్ట్ సర్వీస్ చైర్మన్ డాక్టర్ రౌతు వీరబ్రహ్మం సహకారంతో నిర్వహించిన వైద్య శిబిరంలో గ్రామంలోని 130 మందికి బీపీ, షుగర్ తదితర పరీక్షలు నిర్వహించి రూ.41వేల విలువైన మందులు అందజేశారు. కార్యక్రమంలో చర్చి ఫాదర్ జోసెఫ్, డిస్ట్రిక్ కమిటీ చైర్మన్లు బొల్లం శోభకృష్ణమూర్తి, నెమరుగొమ్ముల రామ్మోహన్‌రావు, జోన్ చైర్మన్ రావిరాల అశోక్, ప్రధాన కార్యదర్శి అండెం వెంకటేశ్వర్లు, కోశాధికారి వి.నారాయణరెడ్డి, కందాల లక్ష్మీ నారాయణరెడ్డి, జి.నారాయణరావు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

మర్రిగూడ : మండలంలోని అజ్జిలాపురం గ్రామానికి చెందిన అల్వాల వెంకటేష్‌గౌడ్‌కు మునుగోడు మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మంజూరైన రూ.20వేల విలువ గల సీఎంఆర్ఎఫ్ చెక్కును వెంకటేష్‌గౌడ్ కుమారుడు అల్వాల దుర్గాగౌడ్‌కు మండల కేంద్రంలో గురువారం బీజేపీ మండల అధ్యక్షుడు రాందాసు శ్రీనివాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య, ఎలిమినేటి సత్తిరెడ్డి, జమ్ముల వెంకటేష్‌గౌడ్, తెగోజు వెంకటాచారి, ఆంజనేయులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ విగ్రహం మార్చాలని వినతి

నకిరేకల్ : రోడ్డు విస్తరణలో భాగంగా సర్కిల్ ఏర్పాటు చేస్తున్నందున నకిరేకల్ మెయిన్ సెంటర్ మధ్యలోకి ఇందిరాగాంధీ విగ్రహాన్ని మార్చాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం మున్సిపల్ కమిషనర్ బాలాజీకి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చామల శ్రీనివాస్, కాంగ్రెస్ నేత దైద రవీందర్, మాజీ సర్పంచ్ పన్నాల రంగమ్మ రాఘవరెడ్డి, వార్డు కౌన్సిలర్ గాజుల సుకన్య, నాయకులు లింగాల వెంకన్న, యాసా కరుణాకర్‌రెడ్డి, బ్రహ్మదేవర రమేష్, గునగంటి రాజు, నకిరేకంటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బస్టాండ్‌లో వసతులు కల్పించాలని..

కనగల్ : మండల కేంద్రంలోని ఎక్స్‌రోడ్డు వద్ద ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు వసతులు కల్పించాలని కోరుతూ ఆర్టీసీ రీజినల్ మేనేజర్ శ్రీదేవికి గురువారం జెడ్పీటీసీ చిట్ల వెంకటేశంగౌడ్ వినతి పత్రం అందజేశారు. బస్టాండ్‌లో సీసీ రోడ్లు, ప్రహరీ, మరుగుదొడ్లు నిర్మించాలని కోరారు. ఆయన వెంట ఎర్రమాద వెంకట్‌రెడ్డి ఉన్నారు.

24న నియోజకవర్గ బూత్ స్థాయి సమావేశం



మాట్లాడుతున్న బూర నర్సయ్యగౌడ్

నకిరేకల్ : ఈ నెల 24న నకిరేకల్ పట్టణంలో నిర్వహించనున్న బీజేపీ నియోజకవర్గ బూత్‌స్థాయి విస్తృత సమావేశానికి ప్రతి బూత్ నుంచి 20 నుంచి 30 మంది తగ్గకుండా హాజరు కావాలని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ కోరారు. నకిరేకల్‌లో గురువారం జరిగిన బీజేపీ ముఖ్యుల సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు చేపూరి రవీందర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో అసెంబ్లీ కన్వీనర్ మైల నర్సింహ, బీజేపీ నాయకులు మండల వెంకన్న, నకిరేకంటి మొగిలయ్య, గోలి ప్రభాకర్, ఐతగోని అనిత, పట్టణ, మండల అధ్యక్షులు పల్స శ్రీనుగౌడ్, యానాల శ్రీనివాస్‌రెడ్డి, కొరివి శంకర్, రాచకొండ గోపి, మాస శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బీఆర్ఎస్‌లో చేరిక



మంత్రి కేటీఆర్‌తో ఎమ్మెల్యే చిరుమర్తి



కట్టంగూర్ : పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కట్టంగూర్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలు పార్టీల నాయకులు కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. గురువారం మండలంలోని గార్లబాయిగూడెం గ్రామానికి చెందిన పలు పార్టీల నాయకులు సుమారు 100 మంది నార్కట్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. జెడ్పీటీసీ తరాల బలరాములు, సర్పంచ్ బోడ సరితయాదగిరి, గ్రామశాఖ అధ్యక్షుడు సైదులు, రాములు పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారిలో పర్వతం వెంకన్న, పరమేష్, లింగస్వామి, నర్సింహ, అంజయ్య, కోటేష్, జానయ్య, వెంకన్న, సైదులు ఉన్నారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన ఎమ్మెల్యే చిరుమర్తి

నకిరేకల్ : ఇటీవల విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు విచ్చేసిన ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను గురువారం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. బీఆర్ఎస్ నకిరేకల్ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

పాఠశాలలో ఇటుకలు మోసిన విద్యార్థులు



గోడపై నిలబడి ఇటుకలు మోస్తున్న విద్యార్థులు

కనగల్ : మండల పరిధిలోని చర్లగౌరారం ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రమాదకరంగా పాఠశాల గోడపై నిల్చొని ఇటుకలు మోస్తున్న వీడియో గురువారం సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. దీంతో పాఠశాల హెచ్ఎం విద్యార్థులతో ఇటుకలు మోయిస్తున్నాడని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎంఈఓ రాములు, హెచ్ఎం రాంబాబులను వివరణ కోరగా.. పాఠశాల గేటుకు బుధవారం సర్పంచ్ యాదగిరి మరమ్మతులు చేపట్టిందుకు ట్రాక్టర్‌లో ఇటుకలు తెప్పించారని పేర్కొన్నారు. కాగా జాతీయ జెండా దిమ్మె చుట్టూ మొక్కలు నాటేందుకు అలంకరణ చేయడానికి 40 ఇటుకలు తీసుకురావాలని 9, 10వ తరగతికి చెందిన 10 మంది విద్యార్థులకు చెప్పగా వారు తెచ్చారని వివరించారు. ఇదే విషయంపై ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు ఎంఈఓ రాములు తెలిపారు. విద్యార్థులతో పనిచేయించడం తమ ఉద్దేశం కాదన్నారు.

కొనసాగుతున్న అంగన్‌వాడీ సిబ్బంది సమ్మె



నల్లగొండ టూటౌన్ : సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

నల్లగొండ టూటౌన్ : అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ.సలీం అన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మె నాలుగో రోజు సీడీపీఓ కార్యాలయం ఎదుట కొనసాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా, 20న కలెక్టరేట్ ముట్టడి చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దండెంపల్లి సత్తయ్య, పోలె సత్యనారాయణ, సైదాచారి, యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.విజయలక్ష్మి, రత్నమాల, ప్రకృతాంబ, ప్రమీల, సునీత, పార్వతి, సునంద, లక్ష్మమ్మ, సముద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

నకిరేకల్ : సమ్మెలో భాగంగా అంగన్‌వాడీ సిబ్బంది నకిరేకల్ పట్టణంలో ర్యాలీ నిర్వహించి అనంతరం ప్రాజెక్టు అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కందాల ప్రమీల, బొజ్జ చినవెంకులు, రాచకొండ వెంకన్న గౌడ్, వంటెపాక వెంకటేశ్వర్లు, అంగన్‌వాడీ సంఘం జిల్లా అధ్యక్షురాలు పాడిచేటి నాగమణి, సీఐటీయూ నాయకులు వంటెపాక వెంకటేశ్వర్లు, లక్ష్మీ, తరలా శోభారాణి, లూర్దు మేరీ, అండాలు, లలిత, లతీఫా, జయమ్మ, అరుణ, సుష్మిత, చంద్రమ్మ, మంగ, కవిత, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మునుగోడు : మండల కేంద్రంలో ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న సమ్మెకు గురువారం వివిధ పార్టీల నాయకులు మద్దతు తెలిపారు. ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర నాయకుడు రసాల వినోద్‌యాదవ్, రాసమల్ల కృష్ణ, లింగస్వామి, డోల్‌దెబ్బ నాయకుడు మాలిగ యాదయ్య, లింగస్వామి, మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

చిట్యాల : మండలంలోని ఉరుమడ్ల గ్రామంలో రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డికి చెందిన వ్యవసాయ క్షేత్రంలో గురువారం ఓ పాడి ఆవు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. వ్యవసాయ క్షేత్రంలో రక్షణ లేని ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు మేతకు వెళ్లిన ఆవు విద్యుదాఘాతానికి గురికావడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

నాంపల్లిని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలి

నాంపల్లి : నాంపల్లి మండల కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరుతూ అఖిలపక్ష నాయకులు గురువారం మండల కేంద్రంలో రెండో రోజు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. బీజేపీ మండల అధ్యక్షుడు పూల వెంకటయ్య, పానుగంటి వెంకటయ్యగౌడ్, గాదెపాక వేలాద్రి, కోరె సాయిరాం, వినోద్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

నల్లగొండ టూటౌన్ : నీలగిరి పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ కేవీ. రమణాచారి సంబంధిత కాంట్రాక్టర్‌లను ఆదేశించారు. గురువారం పట్టణంలోని ఐటీ టవర్ వద్ద రోడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. పనుల్లో నాణ్యత పాటించి వెంటనే పూర్తి చేయించాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. అదేవిధంగా బీట్ మార్కెట్‌లోని సమీకృత వెజ్, నాన్‌వెజ్ మార్కెట్ పనులను కమిషనర్ పరిశీలించారు. పాత బస్తీలో రోడ్డు విస్తరణ పనులను పరిశీలించి పనులు వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. రానున్న వినాయక చవితి పండుగ వరకు పనులు మొత్తం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏసీపీ నాగిరెడ్డి, మున్సిపల్ సిబ్బంది, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడలు ప్రారంభం

నల్లగొండ టూటౌన్ : జిల్లా కేంద్రంలోని ఔట్‌డోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ అండర్–17 బాలబాలికల నల్లగొండ మండల స్థాయి కబడ్డీ, ఖోఖో పోటీలను గురువారం ఎంఈఓ కె. అరుంధతి ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, ట్రస్మా ఆధ్వర్యంలో క్రీడాకారులకు పులిహోర ప్యాకెట్లను పంపిణీ చేశారు. ట్రస్మా ప్రతినిధి అజీజ్ షరీఫ్, పీడీ సుమలత, వ్యాయామ ఉపాధ్యాయులు విమల, కవిత, శ్రీనివాస్, గిరిబాబు పాల్గొన్నారు.

కోమటిరెడ్డి దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను ఊరేగిస్తున్న నాయకులు

నల్లగొండ రూరల్ : భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి నల్లగొండ అసెంబ్లీ టికెట్‌ను బీసీలకు త్యాగం చేస్తానని చెప్పి, తానే పోటీ చేస్తున్నట్లు ప్రకటించడంతో గురువారం ఆయన దిష్టిబొమ్మను బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ వద్ద దహనం చేశారు. ఈ సందర్భంగా బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు ఐతగోని జనార్దన్ మాట్లాడుతూ బీసీలకు తగిన ప్రాధాన్యత ఇచ్చే రాజకీయ పార్టీకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కారింగ్ నరేష్, యాదగిరి, రామన్న, లక్ష్మణ్, ఉపేందర్, మహేష్, విగ్నేష్, శేఖర్, రమేష్ అంజి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ భగవానుడి విగ్రహం ఊరేగింపు

నార్కట్‌పల్లి : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూజ్ఞాన వేదిక భువనగిరి కమిటీ ఆధ్వర్యంలో గురువారం నార్కట్‌పల్లిలో శ్రీకృష్ణ భగవానుడి విగ్రహాన్ని ఘనంగా ఊరేగించారు. మండల కేంద్రంలోని వాసవీ భవన్‌లో 9 రోజులుగా నిత్యపూజలు చేసిన గ్రామంలో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు పల్లెర్ల ప్రవీణ్‌కుమార్, దేవేందర్, వీరయ్య, నక్షత్ర, లింగస్వామి, శశికాంత్, కుమార్, మాధవి, లత తదితరులు పాల్గొన్నారు.



ఊరేగింపు నిర్వహిస్తున్న సమితి సభ్యులు

అండర్ పాస్ నిర్మించాలని సంతకాల సేకరణ



సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న చెరుపల్లి సీతారాములు

చిట్యాల : పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా గల జంక్షన్‌లో జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిట్యాలలో గురువారం సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సీతారాములు మాట్లాడుతూ అండర్ పాస్ బ్రిడ్జి లేకపోవడం వల్ల ఎంతోమంది రహదారిపై ప్రమాదాల బారిన పడుతున్నారన్నారు. జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య, నారబోయిన శ్రీనివాసులు, రుద్రారపు పెద్దులు, కత్తుల లింగస్వామి, శీలా రాజయ్య, అవిశెట్టి నర్సింహ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బోనాల వేడుకలు



ఊరేగింపుగా వెళ్తున్న గ్రామస్తులు

మునుగోడు : మండల కేంద్రంలోని దళిత కాలనీకి చెందిన ప్రజలు గురువారం ముత్యాలమ్మ బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉజ్వల రూరల్ డైవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు బొడ్డు నాగరాజుగౌడ్, పోలె వెంకటేశ్వర్లు, పందుల అశోక్, జిట్టగోని కృష్ణ, పందుల రాజేష్, వెంకన్న, నగేష్, అశోక్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభను విజయవంతం చేయాలి

కేతేపల్లి : ఈ నెల 17న హైదరాబాద్‌లో నిర్వహించనున్న కాంగ్రెస్ విజయభేరి మహాసభను విజయవంతం చేయాలని టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ.యూసుఫ్‌జానీ పిలుపునిచ్చారు. గురువారం కేతేపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయన వెంట బయ్య ముత్తయ్య, కోట శ్రీనివాస్, మట్టి అంతయ్య, బంద చిన్నప్ప, గుండు వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఏజెన్సీకి ఫీవర్

గోదావరి పరీవాహక ప్రాంతంలో విజృంభిస్తున్న డెంగీ, విషజ్వరాలు

వర్షాలు, వరదలతో నిన్న మొన్నటి వరకు అవస్థలు • తిరిగి అవే ప్రాంతాల్లో మంచం పట్టిన జనం

సాక్షిప్రతినిధి, వరంగల్: జూలై ,ఆగస్టు మాసాల్లో కురిసిన ఎడతెరపి లేని వర్షాలు గోదావరి పరీవాహక ఏజెన్సీ పల్లెలను కుదిపేశాయి. ఇప్పుడా ప్రాంతాలను విషజ్వరాలు పట్టి పీడిస్తున్నాయి. కొమురమ్‌భీం ఆసిఫాబాద్ జిల్లా మొదలు భద్రాద్రి కొత్తగూడెం వరకు అనేక గ్రామాలు డెంగీ, మలేరియాల వలయంలో బిక్కుబిక్కుమంటున్నాయి. ఎంజీఎం ఆస్పత్రి పూర్వ వరంగల్, ఖమ్మం, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల పేషెంట్లతో కిటకిటలాడుతోంది. ఆయా జిల్లా కేంద్రాల్లోని ఆస్పత్రులు జ్వరపీడితులతో నిండిపోతున్నాయి. ఇప్పటికే ఎనిమిదిమంది వృద్ధులు, మహిళలు, బాలురు మృత్యువాత పడగా, 15 నుంచి 25 రోజులైనా తగ్గని జ్వరాలతో జనం ఆందోళన చెందుతున్నారు.

ఇంటింటా జ్వరపీడితులే...

- వర్షాలు, వరదలతో అతలాకుతలమైన జయశంకర్ భూపాలపల్లి, ములుగు జిల్లాలు.. ఇప్పుడు డెంగీ, మలేరియా, విషజ్వరాలతో విలవిలలాడుతున్నాయి. మహా ముత్తారం, గణపురం, తాడిచర్ల, రేగొండ, కాటారం, మొగుళ్లపల్లి పీహెచ్‌సీల్లో రోజుకు 150 నుంచి 250 మంది ఔట్‌పేషెంట్లుగా వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు.
- ములుగు జిల్లా వెంకటాపురం, మంగపేట, వాజేడు, ఏటూరునాగారం మండలాల్లోని పల్లెలు మంచం పట్టాయి. జిల్లాలో గత జనవరి నుంచి 51 మలేరియా, 18 డెంగీ కేసులు నమోదయ్యాయి.
- పెద్దపల్లి జిల్లా మంథని, కమాన్‌పూర్, రామగిరి, ముత్తారం తదితర మండలాల్లోని 39 గ్రామాల్లో డెంగీ, విషజ్వరాలు జనాలను జడిపిస్తున్నాయి. ముత్తారం మండలంలో బేగంపేటకు చెందిన ఓ మహిళ మృతి చెందగా... డెంగీ బాధితుల సంఖ్య 89కి చేరినట్టు అధికారులు ప్రకటించారు.
- మహబూబాబాద్ జిల్లా గూడూరు, దంతాలపల్లి, మరిపెడ, కొత్తగూడ, గంగారం, కేసముద్రం, గార్ల తదితర మండలాల్లో డెంగీ, విషజ్వరాలు జడలు విప్పాయి.
- భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, ఏజెన్సీ ప్రాంతాల్లో మలేరియా, డెంగీ, విషజ్వరాలు జనజీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు మలేరియా 162, డెంగీ 273, విషజ్వరాలు 2,35,835 కేసులు నమోదయ్యాయి.

ములుగు జిల్లాలో | డెంగీతో నలుగురు మృతి

- వారికి దీర్ఘకాలిక వ్యాధులు కూడా ఉండటం వల్లేనంటున్న అధికారులు
- సీజనల్ వ్యాధులపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు సమీక్ష
- 24 గంటల కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశం



సాక్షి, హైదరాబాద్: ములుగు జిల్లాలో డెంగీతో నలుగురు మరణించారని ఆ జిల్లా వైద్యాధికారులు వెల్లడించారు. అయితే వారు గుండె జబ్బులు, ఊపిరితిత్తుల సమస్యలు, జాండిస్, సికిల్ సెల్ అనీమియా వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నట్టు వివరించారు. రాష్ట్రంలో కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పరిస్థితిపై గురువారం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ శ్రీనివాసరావు, డీఎంఈ రమేశ్‌రెడ్డి, టీవీవీపీ కమిషనర్ అజయ్ కుమార్, అన్ని జిల్లాల డీఎంహెచ్‌వోలు, డీసీహెచ్‌లు, టీచింగ్ హాస్పిటళ్లు, జిల్లా దవాఖానల సూపరింటెండెంట్లు, ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా వైద్యాధికారులు డెంగీ మరణాలపై మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకొచ్చారు. వారం రోజుల్లోనే 10 మంది మరణించారంటూ కొందరు అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్ నుంచి జిల్లాలో వైద్య ఆరోగ్య సిబ్బంది అప్రమత్తంగా ఉన్నారని వెల్లడించారు.

జ్వరాల కోసం ప్రత్యేక ఓపీ కౌంటర్లు...

రాష్ట్రంలో అవసరమైతే జ్వరాల కోసం ప్రత్యేక ఓపీ కౌంటర్లు ఏర్పాటు చేయాలని మంత్రి హరీశ్‌రావు అధికారులను ఆదేశించారు. పిల్లల జ్వరాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్న అంశాలను మంత్రి వివరించారు. డెంగీ కేసులు పెరుగుతున్నట్టు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని, ఫీవర్ కేసులు ఆందోళనకర స్థాయిలో లేవని హరీశ్‌రావు స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఒక్క మరణం కూడా నమోదు కాలేదన్నారు. జ్వర బాధితుల వివరాలను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని, ఆ డేటా ఆధారంగా డీఎంహెచ్‌వోలు హైరిస్క్ ఏరియాలను గుర్తించి జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. జిల్లాల్లో 24 గంటల కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసి ప్రజలకు సమాచారం అందించాలని చెప్పారు. మీడియా సమావేశాలు నిర్వహించి సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. మలేరియా విభాగం అడిషనల్ డైరెక్టర్‌ను కొత్తగూడెం పంపి, అక్కడి పరిస్థితిని సమీక్షించాలని అధికారులను ఆదేశించారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో విషజ్వరాలు

ఇద్దరు మహిళలు, డెంగీతో ఆరు నెలల పాప మృతి


రజని (ఫైల్)


మనీష (ఫైల్)


మినహ (ఫైల్)

వాజేడు/కన్నాయిగూడెం: ములుగు జిల్లా ఏజెన్సీ ప్రాంతాల్లో విషజ్వరాలు మరణ మృదంగం మోగిస్తున్నాయి. రెండు రోజుల్లోనే ఐదుగురు చనిపోయారు. బుధవారం ఇద్దరు చనిపోగా, గురువారం మరో ముగ్గురు మృతిచెందారు. మృతుల్లో ఆరు నెలల పాప ఉండడం గమనార్హం. ములుగు జిల్లా వాజేడు మండలం మొట్లగూడెం గ్రామానికి చెందిన కుర్సం రజని (35), ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్‌లో నివాసి మనీష (30) విషజ్వరంతో మృతిచెందారు. వాజేడు మండల పరిధిలోని దేవాదుల గ్రామానికి చెందిన ఆరు నెలల పాప కూడా డెంగీ జ్వరంతో మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

ధాన్యం కొనుగోలుకు 54 టెండర్లు

- మొత్తం 25 లాట్లలో 8 లాట్లకు ఒక్కొక్కరే బిడ్డింగ్
- మిగతా 17 లాట్లకు 46 సంస్థల పోటీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మిల్లుల్లో మూలుగుతున్న ధాన్యాన్ని గ్లోబల్ టెండర్ల ద్వారా విక్రయించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి మంచి స్పందన లభించింది. తొలి విడతగా 25 లక్షల మెట్రిక్ టన్నుల (ఎల్‌ఎంటీ) ధాన్యాన్ని విక్రయించాలని భావించిన పౌరసరఫరాల సంస్థ ఈ మేరకు గత నెలలో టెండర్లను ఆహ్వానించింది. 25 ఎల్‌ఎంటీల ధాన్యాన్ని 25 లాట్లుగా విభజించి , ప్రతి ఎల్‌ఎంటీ ఒక లాట్‌గా ఆన్‌లైన్‌లో బిడ్స్ ఆహ్వానించింది. గురువారంతో గడువు ముగియగా, సాయంత్రం 5 గంటలకు అధికారులు టెక్నికల్ బిడ్లు తెరిచారు. 25 లాట్ల కోసం మొత్తం 54 సంస్థలు బిడ్లు దాఖలు చేశాయి. ఇందులో 8 లాట్లకు సంబంధించి కేవలం ఒక్కో బిడ్ మాత్రమే దాఖలైనట్లు విశ్వసనీయ సమాచారం. మిగతా 17 లాట్ల కోసం 46 సంస్థలు పోటీ పడ్డాయి.

యాసంగిలో 66.85 ఎల్‌ఎంటీల ధాన్యం సేకరణ

రాష్ట్ర వ్యాప్తంగా గత యాసంగి (2022–23)లో 66.85 ఎల్‌ఎంటీల ధాన్యాన్ని సేకరించారు. ఈ మొత్తం ధాన్యాన్ని మిల్లుల్లో నిల్వ చేయగా, అందులో కొంత భాగం అకాల వర్షాల కారణంగా తడిచిపోయింది. తడిచిన ధాన్యంతో పాటు మిగతా ధాన్యాన్ని కూడా ముడి బియ్యంగా మిల్లింగ్ చేసేందుకు మిల్లర్లు నిరాకరించారు. బాయిల్డ్ రైస్‌గా మాత్రమే ఇస్తామని చెప్పినా, కేంద్రం నిబంధనలతో అది సాధ్యం కాలేదు.

సినిమాల్లోని సీన్లపైనా నజర్

- డ్రగ్స్ వినియోగం ప్రేరేపించేలా ఉంటే చర్యలు
- ఇటీవల విడుదలైన 'బేబీ' సినిమా టీమ్‌కు నోటీసులు
- బాలీవుడ్‌పైనా దృష్టి పెట్టేలా ఎన్సీబీకి సమాచారం
- హైదరాబాద్ పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ వెల్లడి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ స్టేట్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్ (టీఎస్–నాబ్) అధికారులు మాదాపూర్‌లోని విఠల్‌నగర్‌లో ఉన్న ఫ్రెష్ లివింగ్ అపార్ట్‌మెంట్‌లో గత నెల 31న జరిగిన ఓ డ్రగ్ పార్టీపై దాడి చేశారు. ఆ ఫ్లాట్‌లో కనిపించిన సీన్... ఇటీవల విడుదలైన 'బేబీ' సినిమాలోని సీన్లకు మధ్య సారూప్యత ఉందని హైదరాబాద్ పోలీసు కమిషనర్, టీఎస్ నాబ్ డైరెక్టర్ సీవీ ఆనంద్ అన్నారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని ప్రేరేపించేలా ఉన్న ఆ సన్నివేశాలకు సంబంధించి చిత్ర యూనిట్‌కు నోటీసులు ఇచ్చామని, వారు తమ ఎదుట హాజరై వివరణ ఇచ్చారని గురువారం చెప్పారు. అందులో ఉన్న సీన్లపై తాము చెప్పిన తర్వాతే సినిమాలో వార్నింగ్ నోట్ పెట్టారని, అప్పటివరకు అలాంటిది కూడా లేదని అన్నారు. ఇలాంటి అభ్యంతరకరమైన సన్నివేశాలను సినిమాల్లో పెట్టవద్దని ఆనంద్ హితవు పలికారు. వీటి ద్వారా స్ఫూర్తి పొంది అనేక మంది యువకులు మాదకద్రవ్యాలకు బానిసలుగా మారే ప్రమాదం ఉందన్నారు. గతంలోనూ ఇలాంటి సీన్లతో కూడిన సినిమాలు వచ్చాయని, అయితే వాటిని ఎవరూ పట్టించుకోలేదని చెప్పిన ఆనంద్.. ఇకపై ఈ తరహాలో ఉన్న వాటిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. 'టాలీవుడ్ లింకులు ఉన్న డ్రగ్స్ కేసు'లో పరారీలో ఉన్న సూర్య.. స్నాట్ అనే పేరుతో పబ్ నిర్వహిస్తున్నాడని, కొకైన్ వంటి మాదకద్రవ్యాలను స్నాటింగ్ ప్రక్రియ ద్వారా వినియోగిస్తారని చెప్పారు. దీన్ని బట్టి సూర్య తన



వద్ద మాదకద్రవ్యాలు లభిస్తాయని అర్థం వచ్చేలా తన పబ్‌కు పేరు పెట్టాడని భావించాల్సి వస్తోందని ఆనంద్ వ్యాఖ్యానించారు. బాలీవుడ్ చిత్రాల్లోనూ డ్రగ్స్‌ను ప్రేరేపించే సీన్లు లేకుండా చూడాలని, ఉన్న వాటిపై చర్యలు తీసుకోవాలని నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరోను (ఎన్సీబీ) కోరతామన్నారు. ఎన్సీబీ గణాంకాల ప్రకారం దేశవ్యాప్తంగా 14 కోట్ల మంది డ్రగ్స్ వినియోగదారులు ఉన్నారని, దీన్ని సీరియస్‌గా తీసుకున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని వివరించారు. తాము ఇటీవల కాలంలో 33 మంది నైజీరియన్లను అరెస్టు చేయగా, వారిలో 18 మంది బెంగళూరులో స్థిరపడిన వారిగా తేలిందన్నారు. టీఎస్ నాబ్ సేవల విస్తరణకు ప్రత్యేక కోర్టులు ఏర్పాటు చేయాలని హైకోర్టును కోరతామని చెప్పారు.

టాలీవుడ్ తెరపై మరో డ్రగ్ మరక

▶ మొదటి పేజీ తరువాయి

బెంగళూరు డ్రగ్ పెడ్లర్స్‌తో సంబంధాలు ఏర్పడ్డాయి. దీంతో హైదరాబాద్‌తోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోని ఫామ్‌హౌస్‌లు, గెస్ట్ హౌస్‌ల్లో రేవ్ పార్టీలు ఏర్పాటు నిర్వహించేవాడు. స్నాప్‌చాట్‌లో గాడ్ హెడ్స్ పేరుతో ఐడీ క్రియేట్ చేసి దీని ద్వారా డ్రగ్స్ విక్రయిస్తున్నాడు. ఈ యాప్‌లో మెసేజ్ చదవగానే డిస్‌అప్పియర్ అయ్యే ఆప్షన్ ఉండటంతోపాటు కస్టమర్లకు ప్రత్యేక కోడ్‌లు ఇవ్వడం ద్వారా దందా సాగించాడు. గత నెల 31న ఇతడితోపాటు రమణారెడ్డి, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఐజీ వద్ద సీనియర్ స్టెనోగా పని చేస్తున్న డి.మురళిని అరెస్టు చేశారు. వీరిని విచారించడంతో ఈ డ్రగ్స్ మూలాలు బయటపడ్డాయి.

నైజీరియన్ల ద్వారా రామ్ కిషోర్‌కు...

బాలాజీ ముగ్గురు నైజీరియన్లతోపాటు నగరానికి చెందిన రామ్ కిషోర్ వైకుంఠం (పరారీలో ఉన్నాడు) నుంచి డ్రగ్స్ ఖరీదు చేసేవాడు. ప్రస్తుతం బెంగళూరులో ఉంటున్న నైజీరియన్లు అమోబీ చికోడి మొనగాలు, ఇక్వావే మైకేల్, థామస్ అనఘకాలు నుంచి బాలాజీకి కొకైన్, ఎండీఎంఏ, ఎక్స్‌టసీ అందుతున్నాయి. డ్రగ్ పార్టీల నిర్వహణకు బాలాజీకి రమణా రెడ్డి ఫైనాన్స్ చేస్తుండేవాడు. ఇతడికి బ్యాంక్ ఆఫ్ అమెరికాలో ఖాతా ఉంది. ఇందులో ప్రస్తుతం రూ.5.5 కోట్ల బ్యాలెన్స్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతోపాటు రమణారెడ్డి, బాలాజీలకు ఉన్న ఆస్తుల వివరాలు సేకరిస్తున్నారు. వీటిని స్వాధీనం చేసుకోవడానికి కసరత్తు చేస్తున్నారు. బాలాజీ నుంచి డ్రగ్స్ ఖరీదు చేసిన 18 మంది కస్టమర్లలో సినీ రంగానికి చెందిన వారితోపాటు పబ్‌లు, స్నూకర్ పార్లర్ల నిర్వాహకులు ఉన్నారు. హైటెక్ సిటీ ప్రాంతంలో స్నాట్ పబ్ నిర్వహించే సూర్య, జూబ్లీహిల్స్‌లో టెర్రా కేఫ్ అండ్ బిస్ట్రో నిర్వహించే అర్జున్, గుంటూరులో స్నూకర్ పార్లర్ నిర్వహించే పీఎస్ కృష్ణ ప్రణీత్ కీలకం. వీరు తమ సంస్థల్లోనే రహస్య గదులు ఏర్పాటుచేసి డ్రగ్స్ వినియోగానికి సహకరిస్తూ విక్రయిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.

ఫోన్లు ఆఫ్ చేసుకున్న నవ్‌దీప్, రవి

బాలాజీ నుంచి డ్రగ్స్ ఖరీదు చేసి వినియోగిస్తున్న వారిలో సినీ రంగానికి చెందిన వారూ ఉన్నట్లు టీఎస్ నాబ్ గుర్తించింది. హీరో నవదీప్, షాడో, రైడ్ చిత్రాల నిర్మాత రవి ఉప్పలపాటి, మోడల్ శ్వేత, మాజీ ఎంపీ దేవరకొండ విఠల్‌రావ్ కుమారుడు సురేశ్ రావ్, ఇంద్రతేజ్, కార్తీక్‌లతోపాటు కలహర్‌రెడ్డి ఉన్నారు. తెలంగాణ ఎమ్మెల్యేలు బెంగళూరులో జరిగిన డ్రగ్ పార్టీకి హాజరయ్యారనే విషయం 2021లో వెలుగులోకి వచ్చి కలకలం సృష్టించింది. ఈ పార్టీ నిర్వాహకుడు కలహర్‌రెడ్డే కావడం గమనార్హం. మరోపక్క ఎక్సైజ్ అధికారులు దర్యాప్తు చేసిన 2017 నాటి టాలీవుడ్ డ్రగ్స్ కేసులోనూ నవదీప్ పేరు ఉంది. నిందితుల కోసం ఏసీపీ కె.నర్సింగ్‌రావు, ఇన్‌స్పెక్టర్ పి.రాజేష్, కానిస్టేబుల్ సత్యనారాయణ తదితరుల బృందం గాలించింది. అమోబీ చికోడి, ఇక్వావే మైకేల్, థామస్‌తో పాటు సురేశ్ రావ్, కొల్లి రామ్‌చంద్, కూరపాటి సందీప్, అనుగు సుశాంత్ రెడ్డి, కృష్ణ ప్రణీత్‌లను పట్టుకుంది. రూ.10 లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకుంది. నవదీప్, రవి ఉప్పలపాటి ఫోన్లు ఆఫ్ చేసుకుని, కుటుంబంతో పరారయ్యారు.

జిల్లా వార్తలు

సీడబ్ల్యూసీ సమావేశాల్లో పున్న కైలాస్‌కు చోటు


పున్న కైలాస్ నేత

మునుగోడు : హైదరాబాద్‌లో ఈనెల 16, 17తేదీల్లో జరగనున్న సీడబ్ల్యూసీ సమావేశాల్లో మునుగోడుకు చెందిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్న కైలాస్ నేతకు చోటు దక్కింది. ఈ సమావేశాల్లో ఆ పార్టీ జాతీయ నాయకులు రాహుల్ గాంధీ, సోనియా గాంధీతోపాటు వివిధ రాష్ట్రాలకు చెందిన జాతీయ నాయకులు 180మందికిపైగా పాల్గొననున్నారు. అయితే ఈ సమావేశాలకు హాజరుకానున్న నేతలకు ప్రోటోకాల్ ప్రకారం ఆహ్వానించేందుకు ఓ కమిటీని ఏర్పాటు చేశారు. అందులో కైలాస్ నేతకు చోటు దక్కింది. దీంతో పలువురు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు అభినందనలు తెలియజేశారు.

మిస్సింగ్ కేసులు నమోదు

చౌటుప్పల్ : ఓ యువతి, వివాహిత అదృశ్యమైన ఘటనలో గురువారం పోలీసులు కేసులు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామానికి చెందిన ఓ యువతి తల్లిదండ్రులు ఈనెల 11న చిట్యాల మండలంలోని పేరేపల్లి గ్రామానికి వెళ్లారు. గురువారం తల్లిదండ్రులు పేరేపల్లి నుంచి ఇంటికి రాగా ఆ యువతి కన్పించలేదు. వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదే విధంగా పట్టణానికి చెందిన ఓ వివాహిత అదృశ్యమయ్యింది. భర్త స్థానికంగా ఉన్న ఓ పరిశ్రమలో డ్యూటీకి వెళ్లి గురువారం ఉదయం ఇంటికి వచ్చాడు. అనంతరం టిఫిన్ చేశాక ఇంట్లో పడుకున్నాడు. ఈక్రమంలో ఆరు నెలల వయసు కలిగిన కుమార్తెను తీసుకొని అతడి భార్య ఇంటి నుంచి వెళ్లిపోయింది. మధ్యాహ్నం నిద్రలేచి చూడగా భార్య కన్పించలేదు. దీంతో పట్టణంలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

బొమ్మలరామారం : ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని సాయిధామం ఆశ్రమ పీఠాధిపతి రామానంద ప్రభూజీ అన్నారు. బొమ్మలరామారం మండలం పెద్ద పర్వతాపూర్ సాయిధామం సేవాశ్రమంలోని గోశాలలో గురువారం గోపూజ నిర్వహించారు. గోమాతను పూజిస్తే శుభాలు కలుగుతాయన్నారు. కార్యక్రమంలో చంద్రారెడ్డి, బండి మహేష్,జ్యోతి, భక్తులు ఉన్నారు.

కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలి

- ఈటల రాజేందర్

తిరుమలగిరి (తుంగతుర్తి): గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను విస్మరించిన కేసీఆర్ ప్రభుత్వాన్ని గద్దె దించాలని భారతీయ జనతా పార్టీ ఎన్నికల కమిటీ చైర్మన్, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ కోరారు. తెలంగాణ ప్రభుత్వానికి అవినీతిలో గోల్డ్ మెడల్ ఇవ్వొచ్చని అన్నారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో గురువారం తుంగతుర్తి నియోజకవర్గ బూత్ లెవల్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఈటల మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని సంక్షేమ పథకాలు గ్రామాలలో బీజేపీ కార్యకర్తలు ప్రతి ఇంటికి తెలియజేయాలని కోరారు. బీజేపీ అధికారంలోకి వస్తే మహిళలకు రూ.10 లక్షలు వడ్డీ లేని రుణం


మాట్లాడుతున్న ఈటల రాజేందర్, చిత్రంలో బీజేపీ జాతీయ కార్యదర్శి అరవింద్ మీనన్

అందిస్తుందని చెప్పారు. రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు పంట పెట్టుబడి కోసం రూ.10 వేలు ఇస్తే కేంద్ర ప్రభుత్వం రూ.19 వేల ఎరువుల సబ్సిడీ అందిస్తుందని అన్నారు. దళిత బంధు బీఆర్‌ఎస్ కార్యకర్తలకు మాత్రమే అందుతుందని ఆరోపించారు. గతంలో సబ్సిడీపై యంత్రాలు వచ్చేవని, కేసీఆర్ ప్రభుత్వం వచ్చిన తరువాత అన్నీ బంద్ అయ్యాయని అన్నారు.

రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబం దోచుకుంటోంది

తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం కుటుంబ పాలన సాగిస్తూ రాష్ట్రాన్ని దోచుకుంటుందని భారతీయ జనతా పార్టీ జాతీయ కార్యదర్శి అరవింద్ మీనన్ అన్నారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తుందని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ఏ టు జెడ్ వరకు అన్నీ స్కాంలేనని విమర్శించారు. బీజేపీ గెలుపునకు బూత్ స్థాయిలో కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బీజేపీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బొబ్బ భాగ్యారెడ్డి, మాజీ ఎంపీలు జితేందర్‌రెడ్డి, బూర నర్సయ్య గౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి కడియం రామచంద్రయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఓటమి భయంతోనే జమిలి ఎన్నికల కుట్ర

- తుంగతుర్తి ఎమ్మెల్యే కిశోర్‌కుమార్

యాదగిరిగుట్ట : రాబోయే ఎన్నికల్లో ఓటమి భయంతోనే కేంద్ర ప్రభుత్వం జమిలి ఎన్నికలు అంటూ కుట్ర చేస్తుందని తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ కుమార్ అన్నారు. గురువారం యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని ఆయన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. పార్లమెంట్ సెషన్ అయితేనే జమిలి ఎన్నికలపై స్పష్టత వస్తుందన్నారు. తెలంగాణలో అందరు అభ్యర్థులు గెలిచి అసెంబ్లీలో అడుగు పెట్టాలని శ్రీస్వామిని కోరుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి ఏలా ఉందో యాదాద్రి ఆలయాన్ని చూస్తే అందరికి అర్థం అవుతుందన్నారు. అంతకు ముందు ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు సంప్రదాయంగా స్వాగతం పలికారు.


స్వామివారికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కిశోర్ దంపతులు, కుటుంబ సభ్యులు

అనంతరం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకారమూర్తులను దర్శించుకొని, ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చనమూర్తుల చెంత పూజల్లో పాల్గొన్నారు. శ్రీస్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు ఆచార్యులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

హామీలు అమలు చేయని ప్రభుత్వాలను నిలదీయాలి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

అడవిదేవులపల్లి : ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయని ప్రభుత్వాలను నిలదీయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. ప్రజా సమస్యల అధ్యయనంపై మండలంలో గురువారం నిర్వహించిన ప్రజాచైతన్య యాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. 9ఏళ్ల పాలనలో నేటికీ అర్హులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలు, ఉద్యోగాలు కల్పించడంలో తెలంగాణ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. చరిత్రను వక్రీకరిస్తే కాలగర్భంలో కలిసిపోతారని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం ఎర్రజెండా నాయకత్వంలోనే జరిగిందన్నారు. భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాడిన చరిత్ర కమ్యూనిస్టులకు ఉందన్నారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నుంచి మహిళలు, యువకులు సుమారు 800మంది ఆయన సమక్షంలో సీపీఎంలో చేరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యులు ఎం.రవినాయక్, రాగిరెడ్డి మంగారెడ్డి, సీతారాములు, రెమడాల పరశురాములు, సైదులు, కుర్ర శంకర్‌నాయక్, సైదానాయక్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరేష్ ఖమ్మంపాటి శంకర్, పఠాని శ్రీను, బాబునాయక్, కోటిరెడ్డి, శివనాయక్, కోటి, హనుమంతు, తదితరులున్నారు.


యాత్రలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

రాష్ట్ర స్థాయి క్విజ్ పోటీలకు తేజ విద్యార్థులు


విజేతలుగా నిలిచిన తేజ విద్యార్థులు

కోదాడరూరల్ : కోదాడ పట్టణ పరిధిలోని కొమరబండ కేఎల్‌ఆర్ కాలనీలో గల తేజ విద్యాలయ విద్యార్థులు ఇంటాక్ హెరిటేజ్ క్విజ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి మొదటి స్థానంలో నిలిచినట్లు పాఠశాల ప్రిన్సిపల్ రమాసోమిరెడ్డి గురువారం తెలిపారు. సోమవారం సూర్యాపేటలోని ఎస్వీ ఇంజినీరింగ్ కళాశాలలో న్యూఢిల్లీకి చెందిన ఇంటాక్ సంస్థ పాఠశాలల విద్యార్థులకు భారతీయ సంస్కృతి, వారసత్వ సంపద అనే అంశంపై ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో తేజ విద్యాలయానికి చెందిన పదోతరగతి విద్యార్థులు ప్రవీణ్, హృతిక్‌లు విజేతలుగా నిలిచారు. వారు అక్టోబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు తెలిపారు.

డిండి ప్రాజెక్టులోకి 2వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

డిండి : ఎగువ నుంచి డిండి ప్రాజెక్టులోకి 2వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ఇరిగేషన్ ఏఈ ఫయాజ్ గురువారం తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 36 అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 28 అడుగుల మేర వరద నీరు వచ్చి చేరిందని ఆయన పేర్కొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్‌ల పతనం ప్రారంభమైంది


ప్రజా చార్జ్‌షీట్ బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న వి.హనుమంతరావు, ప్రభాకర్‌రెడ్డి, అయిలయ్య తదితరులు

- మాజీ పీసీసీ అధ్యక్షుడు వి.హనుమంతరావు

యాదగిరిగుట్ట : కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీల పతనం ప్రారంభమైందని, ఈ రెండు పార్టీలను తరిమికొట్టేందుకు ప్రజలు కంకణబద్ధులయ్యారని మాజీ పీసీసీ అధ్యక్షుడు, మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. గురువారం యాదగిరిగుట్ట పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బీఆర్‌ఎస్, బీజేపీలపై ప్రజా చార్జ్‌షీట్ బుక్‌లెట్‌ను ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండు సార్లు అధికారంలోకి వచ్చిన బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు ప్రజలను మోసం చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో కలుపుతామని సీఎం కేసీఆర్ సంస్కారం లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. త్వరలోనే బీఆర్‌ఎస్‌ను ప్రజలు బంగాళాఖాతంలో వేస్తారన్నారు. రైతు రాజ్యమని చెబుతున్న సీఎం కేసీఆర్ అదే రైతుల చేతులకు సంకెళ్లు వేశారన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ రెండు దోస్తీ చేస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో దొంగ ఓట్లు వేసేందుకు బీజేపీ ప్రయత్నం చేస్తుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండి అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. విభేదాలను పక్కన పెట్టి పార్టీ కోసం పనిచేయాలని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలని అన్నారు. ఈనెల 17న హైదరాబాద్‌లోని తుక్కుగూడలో నిర్వహించే కాంగ్రెస్ విజయభేరీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఆలేరు సమన్వయకర్త పసునూటి ప్రభాకర్‌రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య, కార్యదర్శి జనగాం ఉపేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ఈరసరపు యాదగిరిగౌడ్, ఎంపీపీ చీర శ్రీశైలం, పట్టణ అధ్యక్షుడు చీర శ్రీశైలం, టీపీసీసీ సభ్యుడు తంగళ్లపల్లి రవికుమార్, పట్టణ అధ్యక్షుడు బందారపు భిక్షపతి, కౌన్సిలర్ ముక్కెర్ల మల్లేష్‌యాదవ్, నాయకులు కలకొలను సతీష్‌రాజ్, గుండ్లపల్లి భరత్‌గౌడ్, ముక్కెర్ల వెంకటేష్, నర్సింహగౌడ్, గణేష్‌యాదవ్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబానికి న్యాయం చేయాలి

- భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

వలిగొండ : మండలంలోని నాగారం గ్రామంలో విద్యుదాఘాతంతో మృతి చెందిన అంజయ్య జంగమ్మ దంపతుల కుటుంబానికి ప్రభుత్వం న్యాయం చేయాలని భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం గ్రామంలో నిర్వహించిన అంజయ్య జంగమ్మ దంపతుల అంతిమ యాత్రలో ఆయన పాల్గొని మృతదేహాలపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుల కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ తీగలు తెగిపడినా పట్టించుకోకుండా అధికారులు నిర్లక్ష్యం చేశారని, దీంతో రైతులు గమనించక గడ్డి కోసే క్రమంలో తీగలు తగిలి విద్యుదాఘాతంతో మృతి చెందారని అన్నారు. నిర్లక్ష్యం చేసిన విద్యుత్ అధికారులపై చర్యలు తీసుకోవాలని, అదే విధంగా మృతుల కుటుంబానికి ఎక్స్‌గ్రేషియా అందజేయాలని, మృతుల కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. వారం రోజుల్లో మృతుల కుటుంబానికి న్యాయం చేయకపోతే హైదరాబాద్‌లోని విద్యుత్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు అండెం సంజీవరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పంజాల రామాంజనేయులు, పచ్చిమట్ల శివరాజ్ గౌడ్, తీగల కృష్ణయ్య, బెలిద నాగేశ్వర్, పాశం సత్తిరెడ్డి, బడుగు సత్యనారాయణ, కందాడి రామకృష్ణారెడ్డి, సామ రాంరెడ్డి, తుమ్మల యుగంధర్‌రెడ్డి, బద్దం సంజీవరెడ్డి, పబ్బు శ్రీనివాస్, పలుసం సతీష్‌గౌడ్, సురేష్, దానయ్య, రమేష్, తదితరులు పాల్గొన్నారు.


మృతదేహాలకు నివాళులర్పిస్తున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి